ప్రజాశక్తి

గురువారం 3 జులై 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

విశాఖ 'కూటమి'లో

రాష్ట్ర స్థాయి పదవుల జోష్

• ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టిసారిస్తారా?

మాధవ్

పల్లా శ్రీనివావసరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'డబుల్ ఇంజిన్' కూటమి సర్కార్‌లో విశాఖకు డబుల్ ధమాకా! లభించినట్టే. టిడిపి, బిజెపిలకు చెందిన రాష్ట్ర అధ్యక్ష పదవులు ఈ ప్రాంతానికి దక్కడంతో రాజకీయ వర్గాల్లోనే కాదు ప్రజల్లోనూ తాజాగా చర్చనీయాంశమైంది. అయితే ఈ పదవులను అలంకరణ కోసమే కాకుండా ఈ ప్రాంత ప్రజలు, కార్మికుల ప్రయోజనాలకు అద్దం పట్టే పాత్రకు ఉపయోగించాలన్న ఆకాంక్ష సర్వత్రా వ్యక్తం కావడం సహజంగా కనిపిస్తోంది. అలా కానియెడల అధ్యక్ష స్థానాలకు 'అపాత్రదానం' అయినట్టే జనం భావిస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. విశాఖకు అనేక రంగాల్లో ఎన్నో ప్రత్యేకతలున్నట్టుగానే రాష్ట్ర స్థాయి రాజకీయ 'పగ్గా'ల విషయంలోనూ ఆ ప్రత్యేకత కనిపిస్తోంది. రాష్ట్రంలోనే పెద్ద నగరం... విశాలమైన సాగర తీరం కల విశాఖ ప్రభుత్వ రంగ సంస్థలకు కీలక కేంద్రంగా ఉంది. కార్మిక, కష్టజీవుల ఉపాధికి అనువైన ప్రదేశంగా విస్తరించింది. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటు బాట పట్టించేందుకు విధానాలు అనుసరించడంతో సమస్య తీవ్రంగా ఉంది. బిజెపికి రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన మద్దతుగా సాగుతున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్పొరేట్‌ల చేతుల్లోకి వెళ్లకుండా రక్షించినప్పుడే విశాఖ ఆర్థిక ప్రగతి సాధ్యమన్నది వాస్తవం. కానీ ఓ పక్క కేంద్ర విధానమైన ప్రయివేటీకరణకు వంతపాడుతూ మరోవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విశాఖను ముంబయి తరహాలో అభివృద్ధి చేస్తానని, దేశంలో నెంబర్-1 నగరంగా మార్చేస్తామంటూ ఇటీవల చేసిన ప్రకటనలూ తెలిసిందే. అలాంటి విశాఖపట్నం ప్రాంతం నుంచి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ఆ పార్టీ అధిష్టానం పల్లా శ్రీనివాసరావు (గాజువాక టిడిపి ఎమ్మెల్యే)ను నియమించింది. తాజాగా బిజెపి కూడా ఇదే తోవ పట్టింది. విశాఖకు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు పివి చలపతిరావు కుమారుడు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల మాజీ ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్‌కు రాష్ట్ర పగ్గాలు దక్కాయి. కూటమి ప్రధాన పార్టీలకు రెండు రాష్ట్ర స్థాయి పదవులు దక్కినట్టే.

విశాఖ ప్రాజెక్టులపై ఎలా స్పందిస్తారో?

ఈ ప్రాంతానికి అత్యంత కీలకమైన విశాఖ కేంద్రంగా దక్షిణ రైల్వే జోన్ పనుల ప్రారంభం, మెట్రో రైల్, విశాఖలో ఐటి రంగ అభివృద్ధి వంటి ప్రజా డిమాండ్లపై త్వరితగతిన స్పందించకపోతే పగ్గాలు చేపట్టి ఉపయోగముండదు. 2014 నుంచి టిడిపి, బిజెపి రాజకీయ పొత్తు తెలిసిందే. పై ప్రాజెక్టులేవీ ముందుకు కదల్లేదు. 2019-2024 మధ్య ఈ పార్టీల మధ్య పొత్తులేనందున 5ఏళ్లు వైసిపి రాష్ట్రాన్ని పాలించింది. అయినా ఏ పార్టీ పాలనలోనూ పై వాటిపై పురోగతి లేదు. రైల్వే జోన్ పనులు ముందుకెళ్లకుండా ముడసర్లోవ సరైన

మిగతా 2లో..

విశాఖలో అంతర్జాతీయ స్థాయి టూరిజం ప్రాజెక్టులు

పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్

సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌జైన్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విశాఖపట్టణంలో టూరిజం ప్రాజెక్టుల రూపకల్పన జరగాలని, భవిష్యత్తులో నిర్వహించబోయే ప్రతిష్టాత్మక కార్యక్రమాల నిమిత్తం స్టార్ రేటింగ్ కలిగిన 10 వేల రూములు అందుబాటులోకి రావాల్సి ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లాకు విచ్చేసిన ఆయన విజయనగరం, విశాఖపట్టణం జిల్లాల అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తొలుత ఉమ్మడి జిల్లాల్లో చేపట్టబోయే టూరిజం ప్రాజెక్టులపై సమీక్షించి తగిన సూచనలు చేశారు. విజయనగరం జిల్లా భోగాపురం మండల పరిధిలో నిర్మించబోయే ఒబేరాయ్ హోటల్, విశాఖపట్టణం జిల్లా భీమిలి మండల పరిధిలోని అన్నవరంలో నిర్మించబోయే మై ఫెయిర్స్ హోటల్ నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని, నిర్ణీత సమయంలోగా ఆయా కంపెనీలకు భూమిని అందజేయాలని ఉమ్మడి జిల్లాల రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కనెక్టింగ్ రోడ్లను వేయాలని, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. గోస్తనీ నది నుంచి పైప్‌లైన్ల ద్వారా ఆయా హోటళ్ల తాగునీటి అవసరాలకు తగ్గట్టుగా చర్యలు తీసుకోవాలన్నారు. భూసేకరణ ప్రక్రియ, ఇతర సాంకేతిక అంశాలను త్వరితగతిన పూర్తిచేయాలని, ఇతర అంశాల్లో ఆయా కంపెనీల యాజమాన్యాలకు నిబంధనలకు అనుగుణంగా ఉమ్మడి జిల్లాల అధికారులు పూర్తి సహాయ, సహకారాలు అందించాలని సూచించారు.

అనంతరం విశాఖపట్టణం జిల్లాలో చేపట్టబోయే టూరిజం ప్రాజెక్టులు, పర్యాటక శాఖ పరిధిలో ఉన్న భూముల క్రమబద్ధీకరణ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. భవిష్యత్తులో వినూత్న రీతిలో పర్యాటకులను ఆకర్షించే విధంగా ప్రాజెక్టులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నగర పరిధిలోకి వచ్చే పర్యాటకులకు స్థానిక టూరిస్ట్ స్పాట్లు తెలిసేలా విరివిగా హోర్డింగులు పెట్టాలని, ఎక్కడికక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు. అడ్వెంచర్, వాటర్ స్పోర్ట్స్, క్రూయిజ్, ఇతర విభిన్న టూరిజం ప్రాజెక్టుల గురించి అందరికీ అవగాహన కలిగే అధికార యంత్రాంగం

మిగతా 2లో..

నిర్లక్ష్యంతోనే ఫార్మా కంపెనీల్లో భారీ ప్రమాదాలు : సిహెచ్ఎన్ఆర్

▶ వార్త మెయిన్‌లో..

విశాఖ నుంచి బయలుదేరిన క్రూయిజ్ షిప్

▶ వార్త మెయిన్‌లో..

మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి చేయాలి : అజశర్మ

▶ వార్త మెయిన్‌లో..

9న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 9వ తేదీన చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 11 గంటలకు జరగనున్న సమావేశానికి, అధికారులు తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. జెడ్‌పిటిసిలు, ఇతర ఆహ్వానితులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయొద్దు

చైతన్య గీతాలతో నిరసన

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయకూడదని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ సిఐటియు మద్దిలపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యాన జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద బుధవారం కళాకారులు డప్పులు, పాటలతో చైతన్య గేయాలను ఆలపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ విధానాలను విడనాడాలని, ఇటీవల తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని తమ గేయాలతో కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఎం.చంటి, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రాము, సిఐటియు మద్దిలపాలెం జోన్ నాయకులు కె.కుమారి, ప్రజానాట్యమండలి గాయకులు జి.ఈశ్వరరావు, ప్రజా గాయకులు దేవిశ్రీ, ప్రజానాట్యమండలి కళాకారులు ఎంటి రాజు, నాగేశ్వరరావు, చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో డబల్ డెక్కర్ బస్సులు

ట్రయల్ రన్ నిర్వహించిన పర్యాటక అధికారులు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ : విశాఖ నగర ప్రజలకు, విహారయాత్రికులకు కొత్తగా డబుల్ డెక్కర్ బస్సులను విశాఖ నగరంలో త్వరలో అందుబాటులోకి వస్తాయని రాష్ట్ర శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ పేర్కొన్నారు. సాగర్ నగర్ బీచ్ వద్ద ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం ప్రాంగణంలో డబుల్ డెక్కర్ బస్సులను, సంబంధిత చార్జింగ్‌స్టేషన్‌ను జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో ప్రజలు, విహారయాత్రికుల కోసం హాఫ్‌ఆన్ -హాఫ్ ఆఫ్ పేరుతో డబల్ డెక్కర్ బస్సులు విశాఖలో అందుబాటులోకి రానున్నాయన్నారు. అందుబాటులో ఉన్న రెండు డబుల్ డెక్కర్ బస్సులలో అన్ని సౌకర్యాలను , బస్సులకు సంబంధిత చార్జింగ్ స్టేషన్ ను క్షుణ్ణంగా పరిశీలించి ట్రయల్‌రన్ నిర్వహించారు. త్వరలో అందుబాటులోకి రానున్న డబుల్ డెక్కర్ బస్సులు విశాఖపట్నం కి సరికొత్త బ్రాండింగ్ ను తీసుకొస్తాయని, టూరిజం ద్వారా విశాఖ నగరం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. బస్సుల నిర్వహణపై ప్రత్యేక కార్యచరణ చేపట్టాలని, ప్రయాణికులకు, విహారయాత్రికులకు బస్సులను తరచుగా అందుబాటులో ఉండేటట్లు నిర్వహణ చేపట్టాలన్నారు. గ్రేటర్ విశాఖపట్నం స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్, టూరిజం శాఖ, సంయుక్తంగా విశాఖపట్నం పోర్ట్ అథారిటీ వారి సౌజన్యంతో అందుబాటులోకి రానున్న ఈ డబుల్ డెక్కర్ బస్సులు త్వరలో విశాఖలో అధికారికంగా ప్రారంభం కానున్నాయన్నారు. అనంతరం జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ విశాఖ నగర ప్రజలకు, నగరానికి విహారయాత్రికులకు ఈ డబుల్ డెక్కర్ బస్సులు మరింత సౌకర్యంగా ఆకర్షణీయ ప్రయాణానికి అనువుగా ఉంటాయన్నారు. బస్సులను స్కూల్‌పిల్లల ఎక్స్పీరియన్స్ ట్రిప్పుల ప్రయాణానికి వినియోగిస్తే బాగుంటుందని ప్రత్యేక కార్యదర్శికి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి మాధవి, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, పి.వి.వి సత్యనారాయణరాజు, ఆనంద్ పాల్గొన్నారు.

4న అల్లూరి జయంతి వేడుకలు

జిఎస్ రాజేశ్వరరావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : బ్రిటిష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి ఉత్సవాలను శుక్రవారం అల్లూరి విజ్ఞాన కేంద్రం, గురజాడ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యాన నిర్వహిస్తున్నట్లు అల్లూరి విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల ఇన్‌ఛార్జి జిఎస్.రాజేశ్వరరావు, గురజాడ సాంస్కృతిక వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు తెలిపారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శుక్రవారం ఉదయం మెడికల్ క్యాంపు, స్కూళ్లలో స్వాతంత్రోద్యమంలో అల్లూరి పాత్రపై వ్యాసరచన పోటీలు, మధ్యాహ్నం నుండి అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉత్సవాల కోసం నగరంలోని గాన, కళాబృందాలన్నింటిని భాగస్వాములుగా చేయాలన్న లక్ష్యంతో 20 రోజులుగా, వారందర్నీ కలిసి ఉత్సవ వివరాలు తెలియజేశామని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం 4 గంటల నుండి అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో వివిధ కళారూపాలతో 200పైగా కళాకారులు పాల్గొంటున్నారని చెప్పారు. ప్రముఖ క్రీడాకారులు, బిల్డర్స్ అసోసియేషన్ నాయకులు జివి.రవిరాజు మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జయంతిని ఇంత ఘనంగా నిర్వహిస్తున్న అల్లూరి విజ్ఞాన కేంద్రం, గురజాడ సాంస్కృతిక సంస్థ వేదికలు అభినందనీయమని, ఈ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సంస్థ అధ్యక్షులు పి.వి.రమణ మాట్లాడుతూ ఈ ఉత్సవాల్లో పాల్గొనే అందరికీ పతకాలు, ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేస్తామన్నారు. కోశాధికారి ఆర్ఎస్ఆర్.మూర్తి మాట్లాడుతూ, విశాఖ నగర ప్రజలంతా పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాలను తిలకించాలని కోరారు. జర్నలిజం స్కూల్ ఛైర్మన్ ఎన్.నాగేశ్వరరావు మాట్లాడుతూ, మంచి అంశాలతో వస్తున్న ఈ కళారూపాలు సమాజ అభివృద్ధికి ఉపయోగపడతాయన్నారు. 4వ తేదీన జరిగే ఉత్సవాలో పాల్గొనేందుకు కళాబృందాలు, కళాకారులు తమ పేర్లను ఫోన్, వాట్సాప్ ద్వారా 949075066, 9704134498, 9247798787 నెంబర్లకు తెలియజేసి రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. ప్రవేశం ఉచితం అని తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజేశ్వరరావు తదితరులు

మొదటి పేజీ తరువాయి..

విశాఖ 'కూటమి'లో రాష్ట్ర స్థాయి పదవుల జోష్

ప్రదేశం కాదని గడిచిన 5ఏళ్లలో బిజెపి, టిడిపి, జనసేన జోన్ ఏర్పాటు పనులను అడ్డుకున్నాయి. తాజాగా ఈ స్థలంలోనే నిర్మాణానికి 'కూటమి' సిద్ధం అయింది. ఇలా ఉద్రిక్తతలను రెచ్చగొడుతూ అభివృద్ధిని కూడా అడ్డుకునే విధానం ఈ పార్టీలు తీసుకున్నాయి. మరలా బిజెపి టిడిపి సహా మరో పార్టీ జనసేన తోడవ్వడంతో 'కేంద్రం, రాష్ట్రం'లోనూ అంతా వీరి హవానే సాగుతోంది. ఇవన్నీ ఒక ఎత్తయితే ఒక్క వైజాగ్ ఉక్కు పరిశ్రమ సమస్య విశాఖనే కాదు యావత్ రాష్ట్రం, దేశంలోనే కార్మికవర్గంలో పోరాట స్ఫూర్తిని నింపుతోంది. కానీ బిజెపి, టిడిపిల్లో చలనం లేదు.

నాడొకటి చెప్పి తర్వాత మాట మార్చి...

2024 ఎన్నికల ముందు కూటమికి చెందిన టిడిపి, జనసేన అగ్రనేతలైన చంద్రబాబు, పవన్ ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చెర నుంచి తప్పిస్తామని భరోసా ఇచ్చారు. కానీ ఆ చర్యలేవీ కానరావడం లేదు. కేంద్రంలో బిజెపి అధికారం మన రాష్ట్రంలో ఉన్న టిడిపి, జనసేన పార్టీల మద్దతుపై ఆధారపడి ఉన్నా బాబు, పవన్ నోరుమెదపడం లేదు. తాజాగా బిజెపి అధ్యక్షుడిగా మాధవ్ తోడవుతుండడంతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తేమిటి? అన్న చర్చ కార్మికవర్గంలో నెలకొంది. అదీగాక రాజకీయాల్లో మాధవ్‌కు తెలుగుదేశం పార్టీతో ముఖ్యంగా చంద్రబాబుతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని బలమైన ప్రచారం ఉంది. టిడిపికి రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న పల్లా శ్రీనివాసరావు ఎన్నికల ముందు తనను గెలిపిస్తే మొదటి అజెండాగా స్టీల్‌ప్లాంట్‌ను కాపాడడమే అని ప్రగల్బాలు పలికారు. తర్వాత విశాఖ స్టీల్‌పై మాటమార్చి కార్మికులపై నిందలు మోపే స్థాయికి వెళ్లారు. ఈ ప్రాంత ప్రయోజనాలను నెరవేర్చేలాగ ఈ ప్రధాన రెండు పార్టీలకు విశాఖ నుంచి ప్రాతినిధ్యం వహించే ఈ ఇద్దరు అధ్యక్షులు పదవులతో ఆ పాత్ర పోషిస్తారా? లేదా? చూడాల్సిందే.

విశాఖలో అంతర్జాతీయ స్థాయి టూరిజం ప్రాజెక్టులు

వినూత్న రీతిలో చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. పర్యాటకుల సంఖ్య పెరిగేలా, స్థానికంగా ఎక్కువ రోజులు గడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో భాగంగా ఆర్‌కె బీచ్, రుషికొండ, మధురవాడ, భీమిలి, కాపులుప్పాడ, దబ్బంద, ఎండాడ, యారాడ తదితర ప్రాంతాల్లో చేపట్టబోయే ప్రాజెక్టులపై, భూసేకరణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ స్పెషల్ సిఎస్‌కు వివరించారు. సమావేశంలో విశాఖపట్టణం జిల్లా కలెక్టర్‌తో పాటు, విఎంఆర్‌డిఎ కమిషనర్ కె.విశ్వనాథన్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, విజయనగరం జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్, ఒబెరాయ్ తదితరులు పాల్గొన్నారు.

'విమెన్, చైల్డ్'లో 'నియోబ్రీత్' ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విమెన్, చైల్డ్ హాస్పిటల్‌లో నియోబ్రీత్‌ను ప్రారంభించినట్లు డాక్టర్ సాయి సునీల్ కిషోర్, డాక్టర్ విజయకృష్ణ, డాక్టర్ మౌనిక, డాక్టర్ ప్రియాంక తెలిపారు. నవజాత శిశువులను రక్షించడానికి నియో బ్రీత్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు. వైజాగ్, చుట్టుపక్కల ప్రాంతాలలో నిర్వహించబడే వాస్తవిక, అనుకరణ, ఆధారిత వర్క్‌షాప్ ద్వారా ఆరోగ్య సంరక్షణ నిపుణులను, అవసరమైన, ప్రాణాలను రక్షించే పునరుజ్జీవన నైపుణ్యాలతో సన్నద్ధం చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ప్రతి సంవత్సరమూ లక్షలాది మంది నవజాత శిశువులు జీవితంలోని మొదటి నిమిషాల్లో ప్రాణాంతక సవాళ్లను ఎదుర్కొంటారన్నారు. ముఖ్యంగా వనరులు పరిమితంగా ఉన్న పరిస్థితులలో నవజాత శిశు మరణాలకు ప్రధాన కారణాలలో బర్త్ అస్ఫిక్సియా ఒకటిగా ఉందని తెలిపారు. సకాలంలో ప్రభావవంతమైన పునరుజ్జీవనం నివారించగల మరణాలు, వైకల్యాలను నాటకీయంగా తగ్గిస్తుందన్నారు. ఈ ముఖ్యమైన అవసరాన్ని గుర్తించి నియోబ్రీత్ అనుభవజ్ఞులైన నియోనాటాలజిస్టులు, శిశువైద్యులు, నర్సులు, ఆరోగ్య సంరక్షణ కార్మికులను ఆచరణాత్మక అభ్యాసం కోసం ఒకచోట చేర్చుతుందని వివరించారు. అంతర్జాతీయ సంస్థల తాజా మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యాధునిక నియోనాటల్ మానికిన్స్, సిమ్యులేషన్ పరికరాలను నియోనాటల్ రిససిటేషన్ ప్రోగ్రామ్ ఉపయోగిస్తుందని తెలిపారు.

బిఎస్ఎన్ఎల్‌లో వేతన సవరణ చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : బిఎస్ఎన్ఎల్‌లో ఉద్యోగులకు వేతన సవరణ వెంటనే చేయాలని బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పిఇసిహెచ్‌వి.సాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డాబాగార్డెన్స్ బిఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బిఎస్ఎన్ఎల్ నష్టాలకు ప్రధాన కారణం ప్రభుత్వ విధానాల తప్ప మరొకటి కాదన్నారు. తప్పు తన వద్ద ఉంచుకొని బిఎస్ఎన్ఎల్‌కు నష్టాలు వస్తున్నందున ఉద్యోగులకు వేతన సవరణ చేయకూడదని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అన్ని యూనియన్లు అసోసియేషన్లు అనేక సమ్మెలు పోరాటాలు చేస్తున్నప్పటికీ వేతన సవరణ జరగలేదని, ఇది మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులలో 60 శాతం మంది స్టాగ్నేషన్ సమస్యతో బాధపడుతున్నారని, వెంటనే వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 9వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులంతా భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కుమారమంగళం, యూనియన్ జిల్లా అధ్యక్షులు వి.విశ్వేశ్వరరావు, త్రినాథ్‌రెడ్డి, శ్రీనివాస, బుడ్డిదొర పాల్గొన్నారు.

జివిఎంసి కమిషనర్‌ను కలిసిన పంచకర్ల

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: జివిఎంసి నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కేతన్‌గార్గ్‌ను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు జివిఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా వారిరువురూ విశాఖ నగర అభివృద్ధిపై, నగర ప్రజలకు కల్పించే మౌలిక వసతులు, అందించే సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలపై చర్చించుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్ భీశెట్టి వసంతలక్ష్మి, కార్పొరేటర్ కందుల నాగరాజు పాల్గొన్నారు.

5న మెగా క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ: డిజిటల్ పరివర్తనకు పెరుగుతున్న డిమాండ్ కారణంగా భారతీయ సాఫ్ట్‌వేర్ మార్కెట్ గణనీయమైన వృద్ధిని సాధిస్తోందని మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సెంట్రల్ మేనేజర్ వరద రవికుమార్ అన్నారు. విశాఖపట్నం మిలీనియం సాఫ్ట్‌వేర్ క్యాంపస్‌లో డ్రైవ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాఫ్ట్‌వేర్ ఉత్పత్తులు, సేవలకు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ రానున్న కాలంలో మరింత పెరుగుతుందన్నారు. వీటిలో ప్రధానంగా ఎఐ , క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ పరివర్తన వంటి రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. విశాఖపట్నంలోని మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్‌తో మెగా క్యాంపస్ డ్రైవ్‌ను ఈ నెల 5న మిలీనియం సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్‌లో నిర్వహిస్తామని ప్రకటించారు.

'సుపరిపాలనలో తొలి అడుగు' ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 35వ వార్డులో టిడిపి ఆధ్వర్యాన బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎం.శ్రీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి గత ఏడాది కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రతి కుటుంబాన్నీ కలిసి సమస్యలనడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని వార్డు నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్, వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, టిడిపి నాయకులు బుచ్చా రామురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సవరణ

ది. 27 జూన్ 2025న ప్రచురించబడిన ప్రజాశక్తి జిల్లా ఎడిషన్ 2వ పేజీలో కింది ప్రకటనలో "మహారాజశ్రీ గాజువాక XIIIవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు గాజువాక (విశాఖపట్నం) దావా నెంబర్ CRLA No. 63/2022కు బదులుగా CRLA No. 63/2023 పడినందున సవరణ చేయడమైనది.

కావున ఇందు మూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

CRLA No. 63/2022గా పరిగణించవలెను.

M G W DAVID RAJU
M G ROBIN WILLINGTION
పిటిషనర్ తరపు న్యాయవాదులు, గాజువాక, విశాఖపట్నం.
సెల్: 9246992699, 7207992699

IN THE HON'BLE COURT OF THE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE : AT VISAKHAPATNAM
O.S.No. 119 of 2025

Between:
Smt. Kolaventy Kaveri Lakshmi Bai ... Plaintiff
And:
Sanapala Varaha Narasimham and 6 others ... Defendants
To
1) Sanapala Varaha Narasimham, S/o. S. Kannababu, Hindu, age not known to the Plaintiff, Resident of D.No.39-20-53, Ganesh Towers, Kalinga Nagar, Madhavadhara, Visakhapatnam - 530 007.
(Defendant No.1)
2. Smt. Sanapala Padmavathi, W/o. S. Satyanarayana, Hindu, age not known to the Plaintiff, Resident of D.No.39-20-53, Ganesh Towers, Kalinga Nagar, Madhavadhara, Visakhapatnam - 530 007.
(Defendant No.2)
3. Sanapala Lakshmana Rao, S/o. S. Kannababu, Hindu, age not known to the Plaintiff, Resident of D.No.39-20-53, Ganesh Towers, Kalinga Nagar, Madhavadhara, Visakhapatnam 530 007.
(Defendant No.3)
4. Sanapala Jhansi Lakshmi, W/o. S. Srinivas, Hindu, age not known to the Plaintiff, Resident of D.No.39-20-53, Ganesh Towers, Kalinga Nagar, Madhavadhara, Visakhapatnam-530 007.
(Defendant No.4)
NOTICE
Please take notice that the Plaintiff filed the above suit against the Defendants No.1 to 7 praying the Hon'ble Court for cancellation of documents No.6 and 7 in the list of documents of the plaint as prayed and etc. prayers as prayed in the plaint.
You are hereby summoned to appear in the above court in person or through a pleader duly instructed, and the matter stands posted to **11-07-2025 at 10.30 AM** for your appearance, in default of your appearance on that day the matter will be heard and determined in your absence basing on the material available in the court.

R.K. MISRO, Advocate,
D.No.10-12-7/2, Rednella Towers,
Rednam Gardens, Visakhapatnam.
Phone No.93931 12360

IN THE HON'BLE COURT OF THE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE ::: AT VISAKHAPATNAM
IA No.56 of 2025 In O.S.No.119 of 2025

Between:
Smt. Kolaventy Kaveri Lakshmi Bai ... Petitioner/Plaintiff
And:
Sanapala Varaha Narasimham and 6 others ... Respondents/Defendants
To
1) Sanapala Varaha Narasimham, S/o. S. Kannababu, Hindu, age not known to the Plaintiff, Resident of D.No.39-20-53, Ganesh Towers, Kalinga Nagar, Madhavadhara, Visakhapatnam - 530 007.
(Respondent/Defendant No.1)
2. Smt. Sanapala Padmavathi, W/o. S. Satyanarayana, Hindu, age not known to the Plaintiff, Resident of D.No.39-20-53, Ganesh Towers, Kalinga Nagar, Madhavadhara, Visakhapatnam - 530 007.
(Respondent/Defendant No.2)
3. Sanapala Lakshmana Rao, S/o. S. Kannababu, Hindu, age not known to the Plaintiff, Resident of D.No.39-20-53, Ganesh Towers, Kalinga Nagar, Madhavadhara, Visakhapatnam - 530 007.
(Respondent/Defendant No.3)
4. Sanapala Jhansi Lakshmi, W/o. S. Srinivas, Hindu, age not known to the Plaintiff, Resident of D.No.39-20-53, Ganesh Towers, Kalinga Nagar, Madhavadhara, Visakhapatnam-530 007.
(Respondent/Defendant No.4)
NOTICE
Please take notice that the Plaintiff filed the above suit against the Defendants No.1 to 7 praying the Hon'ble Court for cancellation of documents No.6 and 7 in the list of documents of the plaint as prayed and etc. prayers as prayed in the plaint. Further along with the suit Plaintiff filed the petition bearing IA No.56 of 2025 for grant of ad-interim injunction restraining the Respondents/ Defendants No.1 to 7 not to alienate the petition schedule 'A' and 'B' properties.
You are hereby summoned to appear in the above court in person or through a pleader duly instructed, and the matter stands posted to **11-07-2025 at 10.30 AM** for your appearance, in default of your appearance on that day the matter will be heard and determined in your absence basing on the material available in the court.

R.K. MISRO, Advocate,
D.No.10-12-7/2, Rednella Towers,
Rednam Gardens, Visakhapatnam.
Phone No.93931 12360

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EP86/2016 IN OS 589/2015

S.V.రమణ కుమార్ . . . D.Hr
Vs
బుద్ధ రామకృష్ణ . . . J.DR

వేలం ప్రకటన

పై నెంబరు అమలులోD.Hrకు చెల్లించవలసిన అమలు బాకీ చెల్లించకపోవుటచే J.DR యొక్క ఈ దిగువ షెడ్యూల్ ఆస్తిని పై కోర్టు వారు **తే17-7-2025దిన ఉదయం10:30 నిమిషముల నుండి సాయంత్రం గంటలలోపు** వేలం వేయబడును. కావున వేలంపాటలో పాల్గొదలిచిన వారు పై కోర్టులో హాజరై కోర్టు వారి షరతులకు లోబడి వేలంపాటలో పాల్గొనవలెను.

షెడ్యూల్: అనకాపల్లి జిల్లా, అనకాపల్లి సబ్ రిజిస్ట్రర్, అనకాపల్లి GVMC పరిధిలో, గవరపాలెం, శతకంపట్టు వీధి, TS NO 647 బ్లాక్ నెంబర్ 8, డోర్ నెం.15-12-36 3 ఫ్లోర్లు గల ఆర్సీసీ స్లాబ్ ఇంటికి హద్దులు.

తూర్పు: బుద్ద నాగేశ్వరరావు ఇల్లు
పడమర: కోరుబిల్లి త్రినాధ ఇల్లు
ఉత్తరం: యల్లపు సాంబశివరావు ఇల్లు
దక్షిణం: బుద్ద జయలక్ష్మి గారి ఇల్లు.

తూర్పు నుండి పడమర 33 అడుగులు లేదా 10.05 మీటర్స్. దక్షిణం నుండి ఉత్తరం 13 అడుగులు లేదా 04.00 మీటర్స్. మొత్తం1600 స్క్వేర్ ఫీట్స్ Plinth ఏరియా. EC మరియు పార్టిషన్ షెడ్యూల్ ప్రాపర్టీ యొక్క బౌండరీస్

తూర్పు: ఈ ప్రాపర్టీకి బుద్ద నాగేశ్వరరావుకి మంచిదిగోడ. **పడమర:** ఈ ప్రాపర్టీ కి కోరుబిల్లి త్రినాధరావుకి మండదిగోడ **ఉత్తరం:** యల్లపు సాంబశివరావు **దక్షిణం:** మున్సిపల్ రోడ్డు.

DHR విలువ రూ 15,00,000/-
అమీనా విలువ రూ 23,11,400/-
మార్కెట్ విలువ రూ 23,11,400/-
JDR విలువ: ఇవ్వలేదు.

కె.సురేష్‌బాబు
DHR తరపు అడ్వకేట్, అనకాపల్లి.
సెల్ నెం. 9553505999.

గురువుకు తీరిక లేదు..
విద్యార్థికి చదువు రాదు!

ఇదీ ఏకోపాధ్యాయ పాఠశాలల దుస్థితి

- సజావుగా సాగని విద్యాబోధన
- టీచర్లకు బోధనేతర పనులే అధికం
- తీవ్ర మానసిక ఒత్తిడిలో మాస్టార్లు

మాస్టారు రాకపోవడంతో తరగతిగదిలో ఖాళీగా డెక్కతిపాలెం పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి -భీమునిపట్నం :విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి విద్య అతి ప్రధానమైనది. పిల్లలను భావి పౌరులుగా తీర్చిదిద్దేవి బడులే. ఈ విషయాలు ఏలికలకు తెలియనివేమీ కావు. ఎంచుకున్న విధానాలే మాటలకు, చేతలకు పొంతన కుదరడం లేదు.ప్రభుత్వ రంగంలో వికసించాల్సిన విద్య ఎప్పుడైతే కార్పొరేట్, ప్రైవేట్ ఆధిపత్యం కిందకు నెట్టబడిందో అప్పటి నుంచి విద్య అనేది వ్యాపార సరుకుగా మారిపోయింది. కేంద్ర ప్రభుత్వ నూతన విద్యా విధానం అమలులో భాగమే ఇవన్నీ కూడా.

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో బోధన ఒకింత కష్టమైన పనే. ఒక ఉపాధ్యాయునిపై పని ఒత్తిడిఉంటుంది. ప్రధానోపాధ్యాయుని విధులు కూడా ఇతనే నిర్వహించాల్సి ఉంటుది. రికార్డులు, రిజిస్టర్ల నిర్వహణ, బాత్ రూమ్‌ల పరిస్థితి పై ఏరోజు కారోజు యాప్ లో పంపించే పరిస్థితి గత ప్రభుత్వం లో ఉండేది. ఇప్పుడు ఇదొక్కటి మినహా మధ్యాహ్న భోజనం, టీచర్ అటెండెన్స్, విద్యా మిత్ర కిట్లు పంపిణీ, బ్యాగ్ ల ట్యాగ్ లు ఇలా యాప్ లో అప్ లోడ్ చేసి విద్యాశాఖ అధికారులకు పంపిస్తూ ఉండాలి.ఇవన్నీ రోజువారీ విధుల్లో ఈ ప్రక్రియ ఓ భాగం.

ఐదు తరగతులు.. ఐదేసి పాఠ్యాంశాలు

ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఒకటో తరగతి నుంచి 5 వ తరగతి వరకు ప్రతి సబ్జెక్టులూ బోధించాలి. 1,2 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం , 3,4,5 తరగతులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం తో పాటు అదనంగా ఎన్విరాన్ మెంటల్ సైన్స్,. పరిసరాల విజ్ఞానం పాఠ్యాంశాలు బోధించాలి. ఓ వైపు బోధన, మరో వైపు బోధనేతర బాధ్యతలన్నీ ఉన్న ఒక్క టీచరే చూడాల్సిన స్థితిలో వీరు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఫలితంగా బోధనపై ఏకాగ్రత కరువవుతోంది.

ఆరోగ్య సమస్యలు ఎదురైతే...

ఒకే టీచర్ ఉండే పాఠశాలలో సంబంధిత టీచర్ కు అనుకోకుండా అనారోగ్య సమస్య ఎదురైతే పాఠశాల మూసివేయడం తప్పితే వేరే మార్గం కనిపించదు. అటువంటప్పుడు విద్యార్థులకు బోధన ఎలా సాధ్యం అనేది కూటమి ప్రభుత్వం ఆలోచించాలి.మహిళా టీచర్లు ఏకోపాధ్యాయులుగా ఉంటే ఆరోగ్య పరంగా ఇంకా మరిన్ని సమస్యలు ఉంటాయనేది వేరే చెప్పనక్కర లేదు. 20 మంది లోపు విద్యార్థులున్న పాఠశాలలకు రెండో ఉపాధ్యాయుడిని నియమించే అవకాశం లేదని ప్రభుత్వ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.

నమ్మివానిపేటలో పాఠాలు చెబుతున్న టీచర్

నాడు విలీనం.. నేడు హేతుబద్ధీకరణ

గత వైసిపి ప్రభుత్వం విలీనం పేరుతో, ప్రస్తుత కూటమి ప్రభుత్వం హేతుబద్ధీకరణ పేరుతో ప్రాథమిక పాఠశాల విద్యను నిర్వీర్యం చేస్తుందని విద్యారంగ నిపుణులు, పలువురు మేధావులు ఇప్పటికే విమర్శలు గుప్పిస్తున్నారు. అయినా సరే ప్రభుత్వాలు ఏమాత్రం పట్టనట్టుగా వ్యవహరిస్తున్నాయి. అంగన్వాడీ బడి తో పాటు 1,2 తరగతులు బోధించే వాటిని ఫౌండేషన్ పాఠశాలలు గాను, 1 నుంచి 5 తరగతులను బోధించే వాటిని బేసిక్ ప్రాథమిక పాఠశాలలు గాను, మోడల్ ప్రాథమిక పాఠశాలలు గాను ఇలా పలురకాల పాఠశాలలను ప్రస్తుత ప్రభుత్వం ఈ ఏడాది విద్యా సంవత్సరం నుంచి మార్పులు చేసింది.

పిల్లల అడ్మిషన్ల కోసం ఇంటింటికి..

సర్కారు బడులను సంరక్షించుకునే క్రమంలో కొత్త అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్తున్నారు. ఒకే టీచర్ ఉన్న జివిఎంసి రెండో వార్డు నమ్మివానిపేట ప్రాథమిక పాఠశాలలో ప్రస్తుతం 15 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొన్నటి వరకు 11 మంది విద్యార్థులే ఇక్కడ ఉండేవారు. ఒకే టీచర్ ఉన్న బ్యాంక్ కాలనీ,జివిఎంసి ఫౌండేషన్ స్కూల్‌లో ఇద్దరు విద్యార్థులే ఉన్నారు. డెక్కతిపాలెం బేసిక్ ప్రాథమిక పాఠశాలలో 14 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ ఒకే టీచర్ ఉన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే మండలం, జివిఎంసి పరిధిలో 12 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించండి

ప్రజాశక్తి -భీమునిపట్నం : బడి బయట ఉన్న బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ జివిఎంసి నాలుగో వార్డు కె దిబ్బడిపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

'ఎన్రోల్మెంట్ డ్రైవ్' పేరుతో నిర్వహించిన ర్యాలీలో "పిల్లలు ఉండాల్సింది పనిలో కాదు, బడిలో' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ జె చంద్ర శేఖరరావు, జి శ్రీనివాసరావు, ఎంఇంఒ ఎం శివరాణి పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లు సత్వరమే ప్రారంభించాలి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: ప్రథమ సంవత్సరం డిగ్రీ అడ్మిషన్లను త్వరితగతిన ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ, మద్దిలపాలెంలోని డాక్టర్ వి.ఎస్.కృష్ణ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ఎదుట ప్రగతిశీల ప్రజాస్వామ్యవిద్యార్థి సంస్థ (పిడిఎస్ఒ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పిడిఎస్ఒ విశాఖ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమై 20 రోజులు గడిచినప్పటికీ డిగ్రీ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు సంబంధించి ఎటువంటి నోటిఫికేషన్ రాలేదన్నారు. ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాలు రెండు నెలల క్రితం విడుదల కాగా, గత రెండు నెలల కాలం నుండి డిగ్రీ నోటిఫికేషన్ కోసం విద్యార్థులు ఎదురు చూస్తూనే ఉన్నారు. సాధారణ డిగ్రీ అడ్మిషన్లు ఆలస్యం అవుతుండటం వలన విద్యార్థులు ఇంకా ఇతర కోర్సులు వైపు మొగ్గు చూపాల్సి వస్తోందన్నారు.

న్యాయవాదుల సంఘానికి కోర్టు క్యాంటీన్ అప్పగింత

ప్రజాశక్తి - విశాఖ లీగల్ : న్యాయవాదులు కల ఫలించింది. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత న్యాయవాదుల సంఘం కొత్త క్యాంటీన్‌ను స్వాదీన పరుచుకుంది. విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎంకె శ్రీనివాస్‌కు విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు బుధవారం సాయంత్రం క్యాంటీన్ తాళాలు అప్పగించారు. ఇకపై ఈ క్యాంటీన్ నిర్వహణ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ఉంటుంది. గతంలో నెలకు రూ.90 వేలకు పైగా వసూలు చేసిన రోడ్లు భవనాల శాఖ క్యాంటీన్, ఇపుడు న్యాయవాదుల సంఘానికి అప్పగించడంతో కేవలం రూ.30 వేలకే అద్దెకిస్తారు. దీనివల్ల న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ఇతరులు అందరికీ అతి తక్కువ ధరలో టిఫిన్లు, భోజనాలు అందుబాటులోకి వస్తాయి.

ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎంకే శ్రీనివాస్ మాట్లాడుతూ క్యాంటిన్‌లో అందరికీ అనువైన అతి తక్కువ ధరలతో ఫలహారాలు భోజనాలు లభ్యం అవుతాయన్నారు. క్యాంటీన్ న్యాయవాదుల సంఘం ఆధీనంలో ఉన్నందున ఎటువంటి అవకతవకలకు అవకాశం ఉండదన్నారు. త్వరలోనే క్యాంటీన్‌ను ప్రారంభించి వినియోగంలోకి తెస్తామ న్నారు. కాగా న్యాయవాదులకు ప్రత్యేకంగా భోజన ఫలహారాలు ఆరగించడానికి వీలుగా సౌకర్యాలను కల్పించాలని బార్ అధ్యక్షుడికి ఆలిండియా లాయర్స్ యూనియన్ ప్రతినిధులు సూచించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ఉక్కునగరం: గాజువాక నియోజకవర్గం 87వ వార్డు పరిధిలోపలు అభివృద్ధి పనులకు స్థానిక కార్పొరేటర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోండా జగన్నాథం బుధవారం శంకుస్థాపన చేశారు. కణితి రజక వీధిలో సీసీ ఫ్లోరింగ్, వడ్లపూడిలో సామాజిక భవనం స్లాబ్ విస్తరణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరిగాయి. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతుఊ, వార్డును నగరంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో బెల్లంకొండ రాజన్ రాజు, బోండా ఎల్లాజీ, బొట్టా ప్రకాష్, జీవీ రమణ, మురళి, పోతల కృష్ణ, బొడ్డేటి దేవుళ్ళు,ఆదినారాయణ, కల్యాణ్ చక్రవర్తి, సుందర్ సునీల్, కర్రి కృష్ణ పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ జగన్

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- పెందుర్తి : స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెందుర్తికి చెందిన బమ్మిడి గౌరీష్(41) అనే వ్యక్తి మంగళవారం రాత్రి ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివి.

పెందుర్తి కృష్ణరాయపురానికి చెందిన గౌరీష్ కార్పెంటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తాగుడికి బానిసై, ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్న గౌరీష్, మంగళశారం రాత్రి ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి బమ్మిడి నూకాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెందుర్తి పోలీస్‌లు కేసు నమోదు చేశారు. సిఐ కెవి. సతీష్ కుమార్ పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ బి. అప్పారావు దర్యాప్తు చేస్తున్నారు.

మద్యంతో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి -భీమునిపట్నం : వైన్ షాప్‌ల వద్ద మద్యం కొనుగోలు చేసి అధిక ధరలకు అక్రమంగా అమ్మకాలు చేస్తున్న ఇద్దరు వ్యక్తులను స్థానిక పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం..భీమిలి మండలం చిప్పాడ కు చెందిన జీరు రమణ రాజయ్య అదే గ్రామంలో పాన్ షాప్ నిర్వహిస్తున్నాడు. వైన్ షాప్‌ల వద్ద మద్యం కొనుగోలు చేసి, దాన్ని తమ పాన్‌షాప్‌లో అధిక ధరలకు అక్రమంగా అమ్మకాలు చేస్తున్నాడు. అందిన సమాచారం మేరకు స్థానిక ఎస్ఐ జి హరీష్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేశారు. 16 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఇదే మండలం గొల్లల తాళ్ళవలస గ్రామానికి చెందిన కొంగరాని సంతోష్ కూడా వైన్ షాప్‌ల వద్ద మద్యం కొని, నాలుగో వార్డు జెవి.అగ్రహారంలో రేకుల షెడ్డులో అధిక ధరలకు మద్యం బాటిళ్లను అమ్ముతున్నాడు. అందిన సమాచారం మేరకు ఎస్ఐ ఎం రాధాకృష్ణ, సిబ్బంది ఆకస్మిక దాడులు చేసి, 53 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాధాకృష్ణ తెలిపారు.

32 మంది మందుబాబులకు జరిమానా

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం మత్తులో వాహనాలు నడిపి పట్టుబడిన 32 మందిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి భీమిలిలోని 15వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టుకు హాజరుపరచగా, మేజిస్ట్రేట్ పి. స్వాతి భవాని ఒక్కొక్కరికీ రూ.పదివేలు చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు తెలిపారు.

32 మందికి రూ. 3.20,లక్షల జరిమానా విధించారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం చట్టపరంగా నేరమేకాకుండా, ప్రాణచెలగాటమని పోలీసులు పదేపదే హెచ్చరిస్తున్నా కొందరి తీరుమారకపోవడంతో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను నిర్వహించి, మద్యం మత్తులో వామనాలు నడిపే వారిని పట్టుకుని కేసులు పెట్టారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను గౌరవించి పాటించాలని, మద్యంమత్తులో వాహనాలను నడపరాదరి ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు సూచించారు.

ప్రకృతి వ్యవసాయ విధానంపై జార్ఖండ్ రైతుల బృందం అధ్యయనం

ప్రజాశక్తి -ఆనందపురం ప్రకృతి వ్యవసాయం విధానంలో సాగు, ఇతర ప్రయోజనాలపై బుధవారం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన 22 మంది రైతుల బృందం తర్లువాడ గ్రామాన్ని సందర్శించారు. గ్రామీణ సేవా సంఘ్ ఆధ్వర్యంలో నాబార్డ్, జిఐజెడ్ సంయుక్తంగా అమలు చేస్తున్న జీవా ప్రాజెక్టులో భాగంగా ప్రకృతి వ్యవసాయ విధానాలపై అధ్యయనానికి వచ్చారు.

రాష్ట్రంలో ప్రభుత్వ పర్యవేక్షణలో రైతు సాధికార సమితి, ఎపి సిఎస్ఎఫ్ ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ మోడళ్లను అధ్యయనం చేశారు. తర్లువాడ గ్రామంలో ప్రత్యేకంగా అమలవుతున్న ఎటిఎం, ఏ గ్రేడ్ మోడళ్లను పరిశీలించారు. సందర్శనలో స్థానిక రైతులు తమ అనుభవాలను జార్ఖండ్ రైతులతో పంచుకున్నారు. ప్రకృతి వ్యవసాయం విధానంలో పొందిన ప్రయోజనాలు, ఖర్చుల తగ్గింపు, పంటల దిగుబడి, ఆదాయాభివృద్ధి తదితర అంశాలపై వివరంగా చర్చించారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎ.మోహనరావు, రీజనల్ ఆఫీసర్ హేమసుందర్, జిల్లా ఎన్ఎఫ్ఎల్‌లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను బలపర్చాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దేశ వ్యాప్తంగా ఈ నెల 9వ తేదీన చేపట్టే సమ్మెను బలపర్చాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు పిలుపునిచ్చారు. జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బ్రిటీష్ కాలం నుంచి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మార్పుచేసి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లు తెచ్చిందని, వీటి వల్ల కార్మికుల ప్రాథమిక హక్కులైన సంఘం పెట్టడం, సమ్మెలు చేయడంతో సహా అనేక హక్కులు కోల్పోతారని తెలిపారు. రోజుకు 8 గంటల బదులు 12 గంటలు పని చేయాలని లేబర్ కోడ్‌లు చెబుతున్నాయని, కార్మికవర్గం సమ్మె చేస్తే ఒకరోజు సమ్మెకు 8 రోజుల జీతం కట్‌అవుతుందని, కార్మిక నాయకులను జైల్లో పెట్టవచ్చని తెలిపారు. పోరాటాలే చేయకుండా అణిచివేసి యాజమాన్యాలకు అత్యధిక లాభాలు తెచ్చి పెట్టడానికి లేబర్ కోడ్స్ వచ్చాయన్నారు.

బిఎంఎస్ రెండు లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించిందన్నారు. ఇందులో వేతనాల కోడ్, సామాజిక భద్రత కోడ్ ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం వేతనాల కోడ్‌లో కనీసవేతనం రోజుకు రూ.178గా నిర్ణయించిందని, దేశంలో ఎక్కడ్కెనా ఇంత తక్కువ వేతనం అమలులో ఉందా? అని ప్రశ్నించారు. బిఎంఎస్ లేబర్ కోడ్‌లను సమర్థిస్తూ జులై 9వ తేదీ కార్మిక సమ్మెను వ్యతిరేకించడం కార్మికవర్గానికి ద్రోహం చేయడమేనన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరించే కేంద్ర ప్రభుత్వ విధానాలను బిఎంఎస్ సమర్థించడం సిగ్గుచేటన్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుకు అప్పగించి కార్మికవర్గాన్ని బాగా తగ్గించి రోబోట్లు, ఆటో మిషన్ పద్ధతిలో నడపాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని, దీనిని బిఎంఎస్ నాయకత్వం సమర్థించడం విశాఖ స్టీల్‌కు ద్రోహం చేయడమేనన్నారు. బిఎంఎస్‌కు ట్రేడ్ యూనియన్‌గా మాట్లాడే నైతిక హక్కులేదని ధ్వజమెత్తారు. కార్మికవర్గం అంతా ఈ నెల 9వ తేదీన చేపట్టే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, బి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కురిమిన

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని బిఆర్ తాళ్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఘనంగా సత్కరించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జనసేన భీమిలి సమన్వయకర్త డాక్టర్ సందీప్ పంచకర్ల ప్రేరణతో, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురిమిన రామస్వామినాయుడు నేతృత్వంలో పాఠశాల ఆవరణలో ప్రత్యేక సమావేశం నిర్వహించి సత్కరించారు.

ఈ సందర్భంగా రామస్వామినాయుడు మాట్లాడుతూ, గడచిన విద్యాసంవత్సరంలో టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతతోపాటు మండలస్థాయిలో రెండు మూడు ర్యాంకులు సాధన, ముగ్గురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటిలో సీట్లు వచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల నిరంతర కృషి, చిత్తశుద్ధి, అంకితభావానికి అభినందనలు తెలిపారు. పాఠశాల హెచ్ఎం అప్పలరాజు నేతృత్వంలోని ఉపాధ్యాయ బృందం అవిరళ కృషి అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులకు క్రమశిక్షణతో విద్యాబుద్ధులు నేర్పారని ప్రశంసించారు. తాళ్లవలస ఉపాధ్యాయ బృందం అందరికీ ఆదర్శనీయంగా, స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కిలారి రమణ, వర్ధన, మండల సోషల్ మీడియా కురిమిన మణికంఠ, తుంపిళ్ల లక్ష్మణరావు, కిరణ్ . గొడ్డు శివ పాల్గొన్నారు.

నేడు ప్రైవేట్ పాఠశాలల మూసివేత

ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : కొంత మంది అధికారుల వేధింపులకు నిరసనగా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర వ్యాపిత పిలుపులో భాగంగా ఈ నెల 3న గురువారం ప్రైవేట్ ,అన్ ఎయిడెడ్ పాఠశాలలను మూసేసి నిరసన తెలియజేస్తున్నట్లు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల అసోసియేషన్ సభ్యులు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ఎంఇఒ ఎం శివరాణికి వినతిపత్రం అందజేశారు. 55 శాతం కంటే ఎక్కువ మంది విద్యార్థులకు సేవలందిస్తున్న ప్రైవేట్ పాఠశాలల్లో దాదాపు 85 శాతం పాఠశాలలు తక్కువ ఫీజుకే నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. తగిన ధ్రువీకరణ లేకుండా పాఠశాలల్లో పిల్లలను చేర్చుకోవాలని యాజమాన్యాలపై ఒత్తిడి చేయడం, షోకాజ్ నోటీసులు ఇవ్వడం, పాఠశాల గుర్తింపును రద్దు చేస్తామని బెదిరింపులకు పాల్పడడం వంటి చర్యలకు నిరసనగా ప్రైవేట్ పాఠశాలలు మూసివేస్తున్నట్లు తెలిపారు. ఎంఇఒకు వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్, సతీష్ కుమార్, అరుణ్ కుమార్ ఉన్నారు

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ దక్షిణ ఎమ్మెల్యే , జనసేన నగర అధ్యక్షులు వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో 38 వార్డు జనసేన ఇంఛార్జి కొల్లి సింహాచలం, హీరా సలీం ఆధ్వర్యంలో అదే వార్డు కు చెందిన బెంగాలీ అసోసియేషన్ షేక్ రాజువులహక్, షేక్ ఇస్మాయిల్, షేక్ నూరహుస్సేన్, షేక్ అల్లాహ్ ఉద్దీన్, మహ్మద్ ఫారుక్ తదితరులు 50 కుటుంబాలు జనసేనలో చేరారు. సీతంపేటలోని జనసేన నగర కార్యాలయంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ వారికి పార్టీ కండువా కప్పి జనసేనలోకి ఆహ్వానించారు కార్యక్రమంలో జనసేన సౌత్ ఇన్‌ఛార్జి శివప్రసాద్ రెడ్డి, 38 వార్డు జనసేన అధ్యక్షులు వెంకట్ అరుణ్, జనసేన నాయకులు హరికృష్ణ 31వ వార్డు ఇంచార్జి మర్రివేముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

గేటు మీటింగ్‌లో మాట్లాడుతున్న సిఐటియు నేత లక్ష్మణమూర్తి

ములగాడ : ఈనెల 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. బుధవారం హెచ్‌పిసిఎల్ లేబర్ గేటు మీటింగ్‌లో సిఐటియు మల్కాపురం జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణమూర్తి, ఐఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి బి.నాగభూషణం, ఎఐటియుసి జిల్లా నాయకులు కె.సత్యనారాయణ, వైఎస్ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు కె.అనిల్‌కుమార్ మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు, ప్రభుత్వ రంగసంస్థల ప్రయివేటీకరణ నిలుపుదల, స్థానికులకు ఉపాధి కల్పన ఇతర డిమాండ్లతో చేపట్టే సమ్మెలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్షులు కె.పెంటారావు అధ్యక్షతన నిర్వహించిన ఆందోళనలో ఎన్‌టియుసి నాయకులు తాతబాబు, ఎఐటియుసి మల్కాపురం జోన్ నాయకులు జి రాంబాబు, హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధానకార్యదర్శి జి.నరేష్ సిఐటియు జోన్ నాయకులు పి.పైడిరాజు, బూడి. శ్రీను, గంగాధర్, గణేష్, దాసు పాల్గొన్నారు.

గంభీరం పాఠశాలలో పరిశుభ్రత భేష్

తనిఖీలు చేస్తున్న స్వచ్ఛసర్వేక్షణ్ బృందం

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గంభీరం ప్రాథమిక పాఠశాలలో పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ బాగుందని స్వచ్ఛ సర్వేక్షణ్ జిల్లా కోఆర్డినేటర్ బి.పద్మిని సంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ్ బృందం పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసింది. పాఠశాలలో మరుగుదొడ్ల నిర్వహణ, తడి,పొడిచెత్త వేరు చేసి నిర్వహణ, విద్యార్థులకు అనుకూలంగా రన్నింగ్ వాటర్ సదుపాయం తదితర అంశాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కోఆర్డినేటర్ బి. పద్మిని మాట్లాడుతూ, గంభీరం పాఠశాలలో అన్ని విధాలుగా పరిశుభ్రత ఉండడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛత స్థాయిని మెరుగుపరిచేందుకు తమబృందం కృషి చేస్తోందన్నారు. పరిశీలనల ఆధారంగా ర్యాంకింగ్‌లు కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్.ప్రభాకర్, డివిఎల్ఎం మూర్తి, పంచాయతీ కార్యదర్శి చలపతిరావు, ప్రధానోపాధ్యాయుడు యువివి ప్రసాద్ పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కరువు!

- ఎన్‌టిఆర్ కాలనీ వాసుల అవస్థలు
- ఏడేళ్లుగా అంధకారంలో జీవనం
- ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా లేని స్పందన
- కూటమి ప్రభుత్వంపైనే నివాసితుల ఆశలు

ఏడేళ్లుగా విద్యుత్ ఇతర సౌకర్యాలకు నోచుకోని ఎన్‌టిఆర్ కాలనీలోని ఇళ్లు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీలో ప్రజలు సవాలక్ష సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. కనీస మౌలిక సౌకర్యాలు లేమితో సతమతమౌతున్నారు. 2018లో ఫిబ్రవరిలో అప్పటి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కాలనీలో 85 మందికి ఇల్లు స్థలాలు మంజూరు చేయగా, కొంతమందికి లాటరీ పద్ధతిలో పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలు అదుకున్న లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ఉపక్రమించి, పునాదులు కూడా వేశారు. అయితే, తరువాత ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి రావడంతో కాలనీ అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ఇప్పటివరకు 25 కుటుంబాలు ఇళ్లు నిర్మించుకొని స్థిర నివాసాలు ఏర్పరచుకున్నప్పటికీ, వారికి విద్యుత్, తాగునీరు, రహదారులు వంటి ప్రాథమిక సదుపాయాలు లేకపోవడంతో ఏడేళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అధికారులను, ప్రజాప్రతినిధులను అనేకసార్లు కోరినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో కొందరు ఇతర ప్రాంతాల నుండి విద్యుత్తు లైన్లు తీసుకుని తాత్కాలికంగా నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. మిగిలిన వారు ఇప్పటికీ చీకట్లోనే జీవిస్తున్నారు.

అయితే ఎంపిపి మజ్జి శారదా ప్రియాంక వెంకట్రావు స్పందించి, ఎన్‌టిఆర్ కాలనీలో మూడు ఫేజ్‌ల విద్యుత్ లైన్ ఏర్పాటుకు 15 స్తంభాలు అవసరమని, దీనికి రూ. 15 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. ఈమేరకు తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత ఎఇని కూడా ఆదేశించారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పురోగతి కనిపించకపోవడంతో కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో మౌలిక వసతులు కల్పించి, ఇక్కడి నివాసితుల సమస్యలను పరిష్కరిస్తామని స్థానిక నేతలు భరోసానిస్తున్నా ఆదిశలో ఆశించిన చర్యలు లేవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఎన్‌టిఆర్ కాలనీలో కనీస వసతులు కల్పనకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. అలాగే మిగిలిన పట్టాదారులు కూడా ఇళ్లను నిర్మించుకునేలా ప్రభుత్వపరంగా ప్రోత్సాహం అందించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అంధకారంలో మగ్గిపోతున్నాం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాలనీలో అభివృద్ధి జరుగుతుందని ఆశించాం. ఏడాది గడిచినా ఏ మాత్రం మార్పు లేదు. కనీసం విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో అంధకారంలో మగ్గిపోతున్నాం.

- కర్రోతు మహేష్, స్థానికుడు

పోలీసు స్టేషన్లకు కొత్త మోటారు సైకిళ్లు

కొత్త మోటారు సైకిళ్లను ప్రారంభిస్తున్న ఎస్పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి

రహదారి భద్రతను మెరుగుపరిచే ఉద్దేశంతో అనకాపల్లి జిల్లాకు రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి కొత్తగా 16 మోటారు సైకిళ్ల కేటాయించారు. వాటిలో 15 టీవీఎస్ అపాచీ, 1 రాయల్ ఎన్ఫీల్డ్ మోటారు సైకిల్ ఉన్నాయి. ప్రతి మోటారు సైకిల్ సైరన్, బ్లింకర్లు, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, క్రౌడ్ కంట్రోల్ టెక్నాలజీతో ప్రత్యేకంగా రూపొందించపడ్డాయి. వీటిని అనకాపల్లి టౌన్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ రోడ్డు వద్ద బుధవారం ఎస్పీ తుహిన్ సిన్హా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రత, ట్రాఫిక్ నియంత్రణలో సమర్ధవంతంగా స్పందించేందుకు ఈ మోటారు సైకిళ్లను జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో వినియోగిస్తామన్నారు. ట్రాఫిక్ అవాంతరాలు ఏర్పడే ప్రాంతాలు, రోడ్డు ప్రమాదాలు జరిగే సంఘటనలకు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది వీటిని ఉపయోగించి తక్షణమే చేరుకునే అవకాశం లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రావణి, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, ఏఆర్‌డీఎస్పీ పి.నాగేశ్వరరావు, అనకాపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటనారాయణ, ఎస్‌బి ఇన్స్పెక్టర్ బాల సూర్యరావు, అనకాపల్లి టౌన్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ సంజీవరావు, అనకాపల్లి రూరల్ ఎస్సై రవికుమార్, ట్రాఫిక్ ఎస్సైలు శేఖరం, సత్యనారాయణ, అర్జునరావు, ఆర్ఎస్ఐ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

సెజ్ నిర్వాసితులందరికీ ఇళ్ల స్థలాలు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎస్ఈజెడ్‌లో అర్హులైన నిర్వాసితులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. అచ్చుతాపురం ఏపిఐఐసి జోనల్ కార్యాలయంలో బుధవారం ఉద్దపాలెం, చిప్పాడ, పూడి, ఎస్సీ బీసీ కాలనీలకు చెందిన నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉద్దపాలెం గ్రామస్తులకు 55, చిప్పాడకు 81, పూడికి 78, బీసీ ఎస్సీ కాలనీ వాసులకు 53 చొప్పున మొత్తం 267 మంది అర్హులైన నిర్వాసితులకు ఇంటి స్థలాలను వెదురువాడలో కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, రెడ్డి శ్రీనివాస్, రాజాన బాషా, గోపి, అధికారులు, పాల్గొన్నారు.

పౌర సరఫరాల డిటిగా రవిబాబు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి మండల సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దారుగా ఏ.రవిబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం కలెక్టరేట్‌లో పనిచేసిన రవిబాబు దేవరాపల్లికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పారదర్శకంగా సేవలందిస్తానని చెప్పారు. రేషన్ పంపిణీలో అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆయన్ను అధికారులు, వివిధ గ్రామాల రేషన్ డీలర్లు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

డాక్టర్ దేముడు బాబుకు ఘన సత్కారం

ప్రజాశక్తి-దేవరాపల్లి : వైద్యరంగంలో విశేష కషి చేసి, అంతర్జాతీయ స్థాయిలో ప్రఖ్యాతి గాంచిన కాశీపురం గ్రామానికి చెందిన న్యూరో ఫిజీషియన్ డాక్టర్ బి.దేముడు బాబును ఘనంగా సత్కరించారు. డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం రాత్రి కాశీపురం కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించారు. అమెరికాలో ఇటీవలే 'బెస్ట్ డాక్టర్ అవార్డు' అందుకున్న డాక్టర్ దేముడు బాబు సేవలు మన గ్రామానికి, మన మండలానికి గర్వకారణంగా నిలుస్తున్నాయని సంస్థ సభ్యులు కొనియాడారు. మరిన్ని అంతర్జాతీయ పురస్కారాలు అందుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

డాక్టర్ దేముడుబాబును సత్కరిస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు

మిడ్డేమీల్స్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నినాదాలు చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రజాశక్తి-పరవాడ : మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం మండల గౌరవాధ్యక్షులు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. పరవాడ మండలంలో పనిచేస్తున్న మధ్యాహ్నం భోజనం కార్మికులు బుధవారం నిరసన తెలిపారు. మిడ్డేమీల్స్ కార్మికులకు కనీసం వేతనం అమలు చేయాలన్నారు. ధరలు ఆకాశాన్నింటిన నేపథ్యంలో ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం ఏ మూలకు సరిపోవడం లేదని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన బిల్లులు ఇవ్వాలని, సెలవులు ఇచ్చినప్పుడు కూడా జీతం చెల్లించాలని, యూనిఫామ్ కల్పించాలని, ఐడెంటీ కార్డు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు అరికట్టాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు డబ్బులు పెంచాలని, నాణ్యమైన బియ్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 9 న జరిగే దేశవ్యాప్త సమ్మెలో మిడ్డేమీల్స్ కార్మికులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కే ఆదిలక్ష్మి, గండి లక్ష్మి, నాగమణి, నూకరత్నం, కే లక్ష్మి, నూకాలమ్మ, రత్నకుమారి, పార్వతి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన జైళ్ల శాఖ డిజి

సబ్ జైలును పరిశీలిస్తున్న ఆ శాఖ డిజి అంజనీకుమార్

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎపి రాష్ట్ర జైలు శాఖ డిజి అంజనీ కుమార్ బుధవారం అనకాపల్లి సబ్ జైలును సందర్శించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. జైలులో పరిస్థితులు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించి అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జైలు పరిపాలనలో పారదర్శకత, శుభ్రత, సౌకర్యాలు మెరుగుపరిచే విధంగా సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కోస్టల్ ఆంధ్ర జైళ్ళ శాఖ డిఐజీ ఎంఆర్.రవికిరణ్ రెడ్డి, అధికారులు ఎన్.వేణుగోపాల్ రెడ్డి, డి.రాజు, అనకాపల్లి సబ్ జైలు సూపరింటెండెంట్ కిరణ్ కుమార్, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రావణి, ఇన్స్పెక్టర్లు విజయ కుమార్, వెంకట నారాయణ, స్వామినాయుడు, పోలీస్ అధికారులు, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

సృజనాత్మకతను విజయవంతమైన ఫలితాలుగా మార్చుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : సృజనాత్మకతను విజయవంతమైన ఫలితాలుగా మార్చుకోవాలని జేఎన్టీయూ జీవిసిఎస్ఈ హెడ్ ఆఫ్ ద డిపార్ట్మెంట్ డాక్టర్ సిహెచ్ బిందు మాధురి అన్నారు. స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో డ్రోన్ టెక్నాలజీ, డిజైన్ థింకింగ్, ఇన్నోవేషన్‌పై ప్రత్యేక సాంకేతిక విజ్ఞాన సదస్సులో రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు. ఎఐసిటిఈ సహకారం తో అటల్ ఫాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం స్టూడెంట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం డ్రోన్ టెక్నాలజీ, డిజైన్ థింకింగ్, సమస్య పరిష్కార ఇన్నోవేషన్లు, ఇండస్ట్రియల్ డిజైన్ ట్రేడ్‌మార్క్‌లపై ప్రత్యేక సెషన్లన నిర్వహించారు. కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్, డాక్టర్ ఓఎం.రావు, ఎన్ఆర్‌డిసి అసోసియేషన్ అసిస్టెంట్ మేనేజర్ సంతోష్ కుమార్, డైట్ కన్వీనర్ డాక్టర్ కె.సుజాత, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు, డీన్ అకడమిక్, వైస్ ప్రిన్సిపల్, వివిధ విభాగాధిపతులు, ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు బడి బస్సు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు బడి బస్సు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా ప్రజా రవాణా అధికారికి బుధశారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి. ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ అనేకమంది విద్యార్థులు రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారని, కళాశాలకు వెళ్లడానికి సరైన బస్సు సౌకర్యం లేక సమయానికి వెళ్ళలేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వారి సమస్యను దృష్టిలో అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు తక్షణమే బడి బస్సు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు రాజు, జగదీష్, సింహాద్రి, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్‌ను అభినందిస్తున్న జయప్రకాష్, గిరిధర్ తదితరులు

వికలాంగ విద్యార్థికి బ్రాంజ్ మెడల్

ప్రజాశక్తి-అనకాపల్లి : జాతీయస్థాయి స్పెషల్ ఒలంపిక్ భారత్ క్రీడా పోటీల్లో మానసిక వికలాంగ విద్యార్థి అప్పికొండ గణేష్ బ్రాంజ్ మెడల్ సాధించారు. గుజరాత్‌లో జరిగిన జాతీయ స్థాయి స్పెషల్ ఒలంపిక్ భారత్ యూనిఫైడ్ వాలీబాల్ పోటీల్లో రావికమతం మండలం మానసిక వికలాంగ విద్యార్థి అప్పికొండ గణేష్ పాల్గొని ఈ మెడల్ సాధించారు. ఈ మేరకు సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ ఆర్.జయప్రకాష్, జిల్లా సహిత విద్య సమన్వయ అధికారి ఎల్.గిరిధర్ బుధవారం అభినందించారు. క్రీడా పోటీల్లో గెలుపొందడానికి ప్రత్యేక శిక్షణ అందించి కృషి చేసిన ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు, జగన్నాథ నాయుడును అభినందించారు.

కల్తీ మద్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎక్సైజ్ అధికారి సుధీర్

ప్రజాశక్తి-అనకాపల్లి : కల్తీ మద్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒక్కోసారి కల్తీ మద్యం సేవించడం ద్వారా ప్రాణాంతకం కావచ్చని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి వి సుధీర్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని సూచించారు. లైసెన్స్ లేని అనధికార వ్యక్తుల నుంచి మద్యం కొనుగోలు చేయడం ప్రమాదకరమని, అది కల్తీ ఈ మద్య కావచ్చని పేర్కొన్నారు. వివాహాలు, పార్టీలు, ఇతర సామూహిక వేడుకల నేపథ్యంలో తక్కువ ధరకు మద్యాన్ని సరఫరా చేస్తామని చెప్పి మోసగించవచ్చని తెలిపారు. అటువంటి అనుమానిత వ్యక్తుల వివరాలను వెంటనే ఎక్సైజ్ శాఖ అధికారులకు తెలియజేయాలని కోరారు. అలాగే టోల్ ఫ్రీ నెంబర్ 14405కు గాని లేదా అనకాపల్లి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి 9440902383 లేదా 7702278287 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

వికలాంగులకు వీల్ చైర్లు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరు యాదవ్ ఆధ్వర్యంలో రూరల్ డెవలప్మెంట్ సర్వీస్ సొసైటీ సంస్థ కార్యదర్శి గాడి శ్రీను సహకారంతో బుధవారం వికలాంగులకు రెండు వీల్ చైర్స్‌ను ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ గండి వెంకట సత్యనారాయణరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రూరల్ డెవలప్మెంట్ సర్వీస్ సొసైటీ సంస్థ కార్యదర్శి గాడి శ్రీను, లబ్ధిదారులు కొల్లి జ్యోతి, నక్క తారకరామ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కూలిన హైస్కూల్ ప్రహరీ

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రహరీ గోడ మంగళవారం అర్ధరాత్రి సమయంలో కూలిపోయింది. బాలికల వసతి గృహ నిర్మాణ పనుల సందర్భంగా ప్రహరీ గోడకు ఆనుకొని వేసిన మట్టి కారణంగా గోడ బలహీనం కాగా, గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలు అది కూలిపోయింది. దీంతో పాఠశాల ఆవరణలోకి అపరిచితులు ప్రవేశించే అవకాశం ఉందని పలువురు అంటున్నారు. విద్యార్థుల భద్రతపట్ల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోడ పునర్నిర్మాణం పనులు వెంటనే చేపట్టి విద్యార్థులకు భద్రత చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

కూలిపోయిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ

స్కాలర్ షిప్‌లు, ప్రశంసా పత్రాలు అందజేసిన ఎస్‌పి

పోలీసుల పిల్లలకు ప్రతిభా స్కాలర్ షిప్‌లు

ప్రజాశక్తి-అనకాపల్లి : పోలీసు కుటుంబాల పిల్లలను ఉన్నత విద్యలో ప్రోత్సహిస్తూ, వారికి భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో ఎదగడానికి ప్రేరణనిస్తూ జిల్లా పోలీస్ అసోసియేషన్ అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రతిభ గల విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చేతుల మీదుగా అందజేశారు. 2024-25 విద్యాసంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 26 మంది పోలీసు కుటుంబాల విద్యార్థులకు రూ.1.30 లక్షల విలువైన స్కాలర్షిప్‌లను అందించారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేస్తే విజయాలను సాధించడం సులభమని ఎస్‌పి పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్స్పెక్టర్లు బాల సూర్యరావు, రమేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, ఇతర పోలీస్ అధికారులు, పోలీస్ అసోసియేషన్ అడహాక్ అధ్యక్షులు సిసిఎస్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, ట్రెజరర్ లలిత, సభ్యులు మొహిద్దిన్, అచ్చయ్య, భూలోక, సత్యనారాయణ, మల్లీశ్వరి, శేషాద్రి, ఎస్‌ఐ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

కోన తాతారావుకు అభినందనలు

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ ఉమ్మడి జిల్లాల కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్‌గా కోన తాతారావు పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా అనకాపల్లి సహకార బ్యాంకు కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా బుధవారం ఆయనను రాష్ట్ర యాదవ సంక్షేమ సంఘం నాయకులు అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ బొట్టా చిన్నియాదవ్, బోడి వెంకట్రావు, బర్నికాన పువ్వుల శ్రీనివాస్, ముగడ అప్పారావు, బొబ్బిలి గోవిందరాజులు, పల్లా సత్యఅప్పారావు, కోన అప్పారావు, బోడి శ్రీనివాసరావు తదిరతులు పాల్గొన్నారు.

గ్రామసభలో పలు సమస్యలపై చర్చ

ప్రజాశక్తి-పరవాడ : మండల కేంద్రం పరవాడ గ్రామంలో సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు అధ్యక్షతన బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభలో మౌలిక సదుపాయాల కల్పన, వ్యవసాయ ఉత్పత్తి నిల్వ కేంద్రాలు, స్వయం సహాయక కేంద్రాలు, చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాలు, సిమెంట్ రోడ్లు తదితరాల నిర్మాణంపై చర్చి నిర్వహించి ఆమోదం తెలిపారు. వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు పైల శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పెద్ద చెరువు రైతు సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, వార్డ్ సభ్యులు పైల అప్పలనాయుడు సత్యవేణి, పైల హరీష్, పంచాయతీ సెక్రెటరీ మురళి పట్నాయక్, పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాశక్తి-సబ్బవరం : భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సహకార సంఘం పర్సన్ ఇన్చార్జి పివిఎస్.శాస్త్రి అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా సబ్బవరం శ్రీదుర్గామాంబ పిఎసిఎస్ బ్యాంక్ ఆవరణలో బుధవారం ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సీఈవో గొంప రమణ, సిబ్బంది జి.దేముడు, సీరంరెడ్డి రామకృష్ణ, రాజు, పాల్గొన్నారు.

ముమ్మరంగా సరుగుడు నాట్లు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : వారం రోజులుగా కురుస్తున్న చిరుజల్లులు సరుగుడు నాట్లకు అనుకూలంగా ఉన్నాయి. దీంతో పలు గ్రామాల్లో రైతులు ముమ్మరంగా సరుగుడు నాటుతున్నారు. మండలంలోని వడ్డాది, బంగారు మెట్ట, చిన్నప్పలపాలెం దిబ్బిడి బుచ్చయ్యపేట, కందిపూడి, పెద్ద మదిన రాజాం తదితర గ్రామాల్లో రైతులు సరుగుడు నారును కొనుగోలు చేసి నాటు తున్నారు.

సరుగుడు నారు తీస్తున్న రైతులు

మున్సిపల్ కార్మికుల వలే జీతాలు చెల్లించాలి

వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - కె.కోటపాడు

గ్రామాల్లో పని చేస్తున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులకు పట్టణాల్లోని మున్సిపాలిటీల పారిశుధ్య కార్మికులకు ఇస్తున్న విధంగా జీతాలు రూ.21,000 చెల్లించాలని సిఐటియు మండల నాయకులు ఈ.నాయుడుబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపిడిఒ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు సిఐటియు ఆధ్వర్యాన బుధవారం వినతిపత్రం అందించారు. టెండర్ విషయంలో 2017, 2023 సంవత్సరాల్లో హైకోర్టు ఇచ్చిన తీర్పు అమలు చేయాలని కోరారు. అలాగే వెలుగు వివోఏల సమస్యలపై వెలుగు ఏపీఎంకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయుడు బాబు మాట్లాడుతూ వివోఏల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, దీర్ఘకాలంగా ఉన్న వేతన బకాయిలు చెల్లించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, నిబంధనలకు విరుద్ధంగా తొలగించిన వివోఏలను విధుల్లోకి తీసుకోవాలని, వివోఏలకు సెల్ ఫోన్లు తోపాటు సిమ్ కార్డులు అందజేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు, పంచాయతీ కార్మికులు దుర్గారావు, అప్పారావు, నాగిరెడ్డి అన్నమనాయుడు, వివోఏలు చిన్నమ్మలు సత్యవతి పాల్గొన్నారు.

రైతులకు వరి విత్తనాలు పంపిణీ

విత్తనాలు పంపిణీ చేస్తున్న గండి బాబ్జీ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మొగలిపురం రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ ఫెడరేషన్ చైర్మన్, టిడిపి నియోజవర్గ ఇన్చార్జ్ గండి బాబ్జి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తమరాన బంగారు నాయుడు, సత్యనారాయణ, అంగటి నానాజీ, వ్యవసాయ అధికారి రమాదేవి, రైతులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని కేపీ అగ్రహారం రైతు సేవా కేంద్రం వద్ద వరి విత్తనాలను స్థానిక ఎంపీటీసీ దేవర అప్పారావు, కూటమి నాయకులు బుధవారం రైతులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షులు అడ్డూరి శ్రీను, తూరుబిల్లి నూకరాజు, దేవర భూలినాయుడు, పాల సంఘ అధ్యక్షులు తూరిబిల్లి వెంకటరమణ(కాసు), అద్దిపిల్లి గోవిందా జొన్నపిల్లి సాయప్ప (తాతలు), రాము, సెక్రెటరీ ఆర్.రాము, అగ్రికల్చర్ అసిస్టెంట్ బాషా పాల్గొన్నారు.

ఉత్సాహంగా సిఐటియు జగదాంబ జోన్ మహాసభ

మహాసభలో పాల్గొన్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సిఐటియు జగదాంబ జోన్ 8వ మహాసభ బుధవారం జగదాంబ సమీపంలోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. గత మూడేళ్లలో చనిపోయిన కార్మికులకు, నాయకులకు సంతాపం తెలియజేశారు. అనంతరం టి.నూకరాజు అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ, బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, ముఖ్యంగా 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మిక హక్కులను హరిస్తోందని చెప్పారు. దీనికి వ్యతిరేకంగా సిఐటియు జగదాంబ జోన్ కమిటీ గత మూడేళ్లుగా పోరాడిందని తెలిపారు. గత మూడేళ్లలో జరిగిన యూనియన్ కార్యక్రమాల నివేదికను ప్రధాన కార్యదర్శి కెవిపి చంద్రమౌళి ప్రవేశపెట్టారు. అనంతరం పట్టాభి రామారావు జమా ఖర్చుల నివేదికను ప్రవేశ పెట్టారు. నివేదికల మీద చర్చలు, సలహాలను, సూచనలను తీసుకుంటూ నివేదికను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ మహాసభలో ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని తీర్మానం చేశారు. అనంతరం కొత్త నాయకత్వాన్ని ఎన్నుకున్నారు.

జోన్ కమిటీ ఎన్నిక

సిఐటియు జగదాంబ జోన్ అధ్యక్షునిగా టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శిగా కర్రి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా వై.రాజు కె.నర్సింగరావు, ఎం.ఈశ్వరరావు, టి.పైడిరాజు, కెవి.రమణరాజు, కార్యదర్శులుగా కెవిపి చంద్రమౌళి, ఎం.సుబ్బారావు, ఎర్రి బాబు, గణేష్, పైడమ్మ, కోశాధికారిగా పట్టాభి రామారావుతో పాటు 12 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యదర్శి కె.గణేష్ వందన సమర్పణ చేశారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్చుతాపురం వెదురువాడ ఫీడర్ల పరిధిలో విద్యుత్ స్తంభాల మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎపిఈపీడీసీఎల్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని వల్ల అచ్యుతాపురం, వెదురువాడ, మోసయ్యపేట, దిబ్బపాలెం, మార్టూరు, రామన్నపాలెం, చౌడపల్లి, భోగాపురంగ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాలను సందర్శించిన డిఇఒ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని గొట్టివాడ ప్రాథమిక పాఠశాలను అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావు నాయుడు బుధవారం సందర్శించారు. పిల్లలతో ముచ్చటించి అభ్యాసన స్థాయిని పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు వివిధ అంశాల్లో కనీస సామర్థ్యాలను నేర్పించాలని సూచించారు. బడిలో చదువుతున్న విద్యార్థులకు,వారి తల్లిదండ్రులకు ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎంజె.రవీంద్రబాబు, ఉపాధ్యాయులు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సముద్రంలో మత్స్యకార యువకుడు గల్లంతు

ఎర్రయ్య (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-అచ్యుతాపురం : పూడిమడక సముద్రంలో బుధవారం తెల్లవారుజామున చేపల వేటకు వెళ్లిన కొండపాలెం గ్రామానికి చెందిన చౌడేపల్లి ఎర్రయ్య (26) గల్లంతయ్యాడు. ఎర్రయ్య, మరికొంతమంది ఫైబర్ బోటుపై సముద్రంలో చేపల వేట చేస్తుండగా ప్రమాదవశాత్తు ఎర్రయ్య సముద్రంలో పడి గల్లంతయ్యాడు. అతనితో వెళ్లిన మత్స్యకారులు ఎర్రయ్య గురించి గాలించిన అతని జాడ కానరాలేదు. ఈ మేరకు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి-సబ్బవరం : పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం బాగుంటుందని ఐఐపిఈ డైరెక్టర్ సాలివాహన అన్నారు. మండలంలోని వంగలి ప్రాథమిక పాఠశాలలో వంగలి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపిఇ) ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రం చేశారు. ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఐటీఈ రిజిస్ట్రార్ రాంపాల్ దివేది, నోడల్ ఆఫీసర్ మురళీకృష్ణ, ఎంఈఓ రవీంద్ర బాబు, సర్పంచ్ ఆకుల శ్రీహేమ గణేష్, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలి

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను రద్దుచేయాలని సిపిఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్ డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని, అదానీతో జరిగిన విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని, జులై 5 తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఐ జిల్లా కార్యాలయంలో బుధవారం కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన, మాట్లాడుతూ, ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని, అదానితో సోలార్ ఒప్పందాన్ని రద్దుచేస్తామని హామీ ఇచ్చి, నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది కాలంలో విద్యుత్ ఛార్జీలను మూడుసార్లు పెంచి ప్రజలపై రూ.15,487 కోట్ల భారం వేశారని తెలిపారు. గత ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను చెల్లించుకోలేక గృహ వినియోగదారులు ఇబ్బందులు పడుతుంటే, మరలా విద్యుత్ ఛార్జీలు పెంచడం శోచనీయమని ఎద్దేవా చేశారు. పెంచిన విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ తేదీన జరుగు ధర్నాలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు సిఎన్.క్షేత్రపాల్, ఎం.మన్మథరావు, ఎన్.నాగభూషణ్, ఎమ్‌డి.బేగం, అన్వేష్, బుజ్జి పాల్గొన్నారు.

అమృత విశ్వవిద్యాపీఠంలో పిహెచ్‌డి అడ్మిషన్లు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అమృత విశ్వవిద్యాపీఠంలో పిహెచ్‌డి అడ్మిషన్ల తొలి దశ ఈ నెల 20వ తేదీ వరకు జరగనున్నాయని విద్యాపీఠం ప్రతినిధి మీడియాకు తెలిపారు. పీజీ పూర్తి చేసిన విద్యార్థులు పిహెచ్‌డి స్థాయిలో అత్యుత్తమ రీసెర్చ్ చేయడానికి అమృత విశ్వవిద్యాలయం ఒకటిగా ఉందని, ఇందులో 3 సంవత్సరాల పాటు నెలవారీ స్టైపెండ్, అంతర్జాతీయ కాన్ఫరెన్సులకు పర్యటన ఖర్చులు, రీసెర్చ్ పబ్లికేషన్‌లకు ఫండింగ్, ట్యూషన్ ఫీజు మినహాయింపు, ఆధునిక ప్రయోగశాలల సదుపాయాలు, అంతర్జాతీయ సహకార అవకాశాలు ఉన్నాయని, ఇది రూ.20 లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తలతో పనిచేసే అవకాశాలు లభిస్తాయన్నారు. అమృత విశ్వవిద్యాలయం అమరావతితో పాటు పలు నగరాలలో అడ్మిషన్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

కోయంబత్తూర్, చెన్నై, కొచ్చి, మైసూరు, ఫరిదాబాద్ క్యాంపస్‌లలో అడ్మిషన్లు అందుబాటులో ఉన్నాయని, కనీసం 60 శాతం మార్కులతో పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. నెట్, గేట్, సిఎస్ఐఆర్ అర్హత కలిగిన వారు నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. మిగతా అభ్యర్థులకు రాత పరీక్షతో పాటు ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. www.amrita.edu/phd ద్వారా దరఖాస్తు చేయవచ్చని పేర్కొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలి

-ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియూ పూర్వ ఉపాధ్యక్షులు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఏ.అజశర్మ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక నవనిర్మాణ సమితి బాబా ప్రాంగణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మద్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు కె.ప్రసన్న అధ్యక్షతన జిరిగిన సదస్సులో ముఖ్యవక్తగా ఎ.అజయ్ శర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కనీస వేతనాలు అమలు కాక తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. నిరుద్యోగం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకీ ప్రజల జీవన ప్రమాణాలు దిగజారి పోతున్నాయని, పిల్లలో పోషహరం లోపం అదికంగా ఉందన్నారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ వివిద రకాల పేరులతో ఉద్యోగం చేస్తున్న కార్మికులకు ఉద్యోగ బద్రత కల్పించకుండా, పని గంటలు పెంచి శ్రమ దోపిడీ చేస్తున్నారన్నారు. కనీస వేతనం అమలు చేయకుండా కార్మికులను అనచి వేస్తున్నారని విమర్శించారు. కార్మికులు, ప్రజలలో ఐక్యత లేకుండా మత విద్వేషాలతో విభజన సృష్టిస్తున్నారని, ఇటువంటి కుట్రలను తిప్పి కొట్టాలని ఐక్యమత్యంగా పోరాడాలన్నారు.

మాట్లాడుతున్న అజశర్మ

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ, నల్ల చట్టాలను తీసికొచ్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించ లేదన్నారు. ఎరువులు, పురుగు మందులు, ప్రైవేటు కంపెనీలు నాణ్యత లేని మందులను అదిక రేట్లకు అమ్మి రైతులను మోసగిస్తున్నారని విమర్శించారు.కార్మికులకు పనులు లేక వలస వెళుతున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ పనులు ప్రారంభమైనప్పటికీ రైతులకు ఋణాలు ఇవ్వలేదని, కానీ కార్పోరేట్లుకు కొట్లాది రూపాయలు మాపీ చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రైవేటు సంస్థలలో లక్షలాది మంది కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేక వెట్టిచాకిరి చేయిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆశా రాష్ట్ర కార్యదర్శి వి. సత్యవతి, జిల్లా ఉపాధ్యక్షులు పివి పరమేశ్వరరావులు మాట్లారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఆశా, మిడ్డేమీల్, స్కూల్ స్లీపర్స్, ముఠా, మున్సిపల్, ఆర్టీసి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కౌలు రైతులకు కార్డులను అందజేయాలి

ప్రజాశక్తి -కోటవురట్ల: అర్హులందరికీ కౌలు రైతు కార్డులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ తిరుమల బాబు అన్నారు. బుధవారం కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీటి తీరువ పన్నుల వసూళ్ల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రెవిన్యూ సమస్యలు పరిష్కారంతోపాటు వివిధ ధ్రువపత్రాలను సకాలంలో అందజేయాలని సూచించారు, ఈ కార్యక్రమంలో డిటి రమేష్, ఆర్ఐ మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దార్

ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గొలుగొండ:ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతి చెందినట్లు కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు బుధవారం తెలిపారు. కృష్ణదేవిపేటకు చెందిన తురుగోలు ధర్మరాజు మంగళవారం వ్యక్తిగత సమస్యలతో మనస్థాపం చెంది గడ్డి మందు తాగారన్నారు. వెంటనే కుటుంబీకులు కృష్ణదేవిపేట పీహెచ్‌సికి తీసుకువెళ్లగా ప్రధమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు.కేజీహెచ్‌కు రిఫర్ చేయగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. ధర్మరాజు భార్య తురుగోలు సాయిసత్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

'సుపరిపాలనలో తొలి అడుగు' ప్రారంభం

ప్రజాశక్తి-మునగపాక : మండల కేంద్రం మునగపాకలో టిడిపి గ్రామ శాఖ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు - టిడిపి ఇంటింటి కార్యక్రమాన్ని బుధ వారం ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, పార్టీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్, గవర కార్పొరేషన్ డైరక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగ భూషణం ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో ప్రభుత్వం ప్రజలకు అందించిన పథకాలను, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. టిడిపి నాయకులు దాడి శివ, విల్లూరి నరసింగరావు, పెంటకోట శ్రీరామ్మూర్తి, ఆడారి పరశు రామ్, ఆడారి లక్ష్మణరావు, సూరిశెట్టి అప్పలనాయుడు, దాడి భీమునాయుడు, భీలా లక్ష్మణరావు, దుర్గినాయుడు, సూరిశెట్టి రాము, మల్ల నర్సింగరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని లంకవానిపాలెంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్, నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి ఏసుబాబు, నాయకులు రొంగలి మహేష్, జూరెడ్డి రాము, సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : మండలంలోని రేవళ్ల గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' ఇంటింటి ప్రచార కర్యాక్రమాన్ని ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు ప్రారంభించారు. టిడిపి నాయకులు గూనూరు మల్లు నాయుడు, ఎర్రంశెట్టి చిన్న, గూనూరు సురేష్, దేవరపల్లి వెంకట అప్పారావు, కోటేశ్వరరావు, సిరిపురం రమేష్ పాల్గొన్నారు.

పాయకరావుపేటలో ప్రచారం చేస్తున్న అనిత

అచ్యుతాపురం : మండలంలోని కాజీపాలెం గ్రామంలో బుధవారం మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, టిడిపి మండల శాఖ అధ్యక్షులు పీలా తులసిరాము ఇంటింటికి ప్రచారం చేశారు. కార్యక్రమంలో గొంతిన హరీష్, కాండ్రేగుల వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రమణ, గంగరాజు, నాగ శ్రీను, మాణిక్యం పాల్గొన్నారు.

గాజువాక: ఎన్నికల హామీలను పూర్తిగా అమలు చేస్తామని గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం 67వ వార్డు జోగవానిపాలెంలో సుపరిపాలనుతొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు.నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, వార్డు టిడిపి అధ్యక్షులు పల్లా రంగా యాదవ్,, ప్రధాన కార్యదర్శి కొమ్మనాపల్లి సింహాచలం, కార్పొరేటర్లు కాకి గోవింద్‌రెడ్డి, లేళ్ల కోటేశ్వరరావు, గంధం శ్రీనివాసరావు, బొడ్డు నరసింహ పాత్రుడు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుచ్చ విజయకుమార్, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వశుద్ధి అనంత లక్ష్మి, పప్పు రాజారావు పాల్గొన్నారు.

ఆనందపురం: అర్హులకు సంక్షేమ లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలతో సాగుతోందని తెలుగు యువత నేత గంటా రవితేజ అన్నారు.మండలంలోని పెద్దిపాలెం చెన్నై కన్వెన్షన్ సమావేశ మందిరంలో భీమిలి నియోజకవర్గ టిడిపి నేతల సమావేశంలో మాట్లాడారు. టిడిపి మండల అధ్యక్షుడు తాట్రాజు అప్పారావు, గన్‌రెడ్డి సోంబాబు, బిఆర్‌బి నాయుడు, బమ్మిడి ఉమా, తారక్, వానపల్లి ముత్యాలరావు బలిరెడ్డి చంటి, మీసాల సత్యనారాయణ, అప్పల రాము, జోగ ముత్యాలు, గంటా నూకరాజు, గాడు చిన్న కుమారి, కురుమి లీలావతి, మొల్లి హేమలత పాల్గొన్నారు.

మునగపాకలో ప్రచారం చేస్తున్న నేతలు

పాయకరావుపేట:మండలంలోని సీతారాంపురంలో బుధవారం హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికి వెళ్ళి ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గ్రామస్థులకు వివరించారు. గ్రామంలో 60 లక్షల నాబార్డు నిధులతో తారురోడ్డు పున్ణనిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. దివిస్ కంపెనీ ఆర్థిక సహాకారంతో నిర్మించిన రక్షిత మంచినీటి వాటర్ ప్లాంట్ ను ప్రారంబించారు. కల్వర్ట్ ను ప్రారంభించారు.

నర్సీపట్నం టౌన్ : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నర్సీపట్నం నియోజకవర్గంలో ఘనంగా ప్రారంభమైంది. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో బూత్ కన్వీనర్లు, ఇన్‌చార్జీలు, మండల నాయకుల సమక్షంలో శివపురంలోని లియో గ్రాండ్ వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ చింతకాయల రాజేష్ మాట్లాడుతూ, మున్సిపాలిటీలో రోడ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు ఇప్పటివరకు రూ.118 కోట్లను ఖర్చు చేసి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండవ ప్రాజెక్ట్ చైర్మన్ కరక సత్యనారాయణ, జడ్పిటిసి సభ్యురాలు సుకల రమణమ్మ, మార్కెట్ యార్డ్ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న రైతులు

రైతుల నిరసన

ప్రజాశక్తి -కోటవురట్ల:భూములు ఆన్లైన్ చేయా లంటూ మాకవరపాలెం మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన రైతులు బుధవారం తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు, దాదాపు పది సంవత్సరాలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకపోవడం పట్ల కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని రైతులు వాపోతున్నారు. ఈ విషయంపై తహసీల్దారు వెంకటరమణను వివరణ కోరగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పది రోజుల్లో గ్రామంలో గ్రామ సభ నిర్వహిస్తామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గ్రామసభ అనంతరం భూమిలను ఆన్లైన్ ప్రక్రియ చేపడతామన్నారు.

వాటర్ శాంపిల్స్ పరిశీలిస్తున్న ఎంపిడిఒ

వాటర్ టెస్టింగ్ తప్పనిసరి

ప్రజాశక్తి -నక్కపల్లి:గ్రామాల్లో వాటర్ టెస్టింగ్ తప్పనిసరిగా చేయాలని ఎంపీడీవో సీతారామరాజు అన్నారు. మండలంలో డిఎల్ పురం గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. డ్రింకింగ్ వాటర్, చేతి బోర్లు వాటర్ శాంపిల్స్ తీయించి, టెస్టింగ్ కు పంపించారు. వాటర్ ట్యాంకు నందు తప్పనిసరిగా క్లోరోనేషన్ చేయించాలని పంచాయతీ కార్యదర్శి కి సూచించారు. గ్రామంలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. తడి పొడి చెత్త ఇంటింటా సేకరించి, సంపద కేంద్రానికి తరలించాలన్నారు. గ్రామంలో చెత్త తరలింపుకు ఉపయోగించునున్న ట్రాక్టర్ ను గ్రామ సర్పంచ్ కిల్లాడ రామకృష్ణ, ఎంపీటీసీ కొండ్ర కనకారావుతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ నేతలు

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు డిమాండ్ చేశారు. నర్సీపట్నం బ్యాంక్ కాలనీ వద్ద బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర బిజెపి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలతో అదానీ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తుందన్నారు. దీంతో ప్రజలు, రైతాంగాపై అధిక భారం పడుతుందని మండిపడ్డారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అదానీ స్మార్ట్ మీటర్లు ఒప్పందం రద్దు చేసే వరకు మేధావులు, ప్రజలు పార్టీ నాయకులు, సభ్యులు పోరాటం చేయాలన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాలిపల్లి వెంకటరమణ, జి.గురుబాబు, నాయకులు శివలంక కొండలరావు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు గుడాల రాధాకృష్ణ, చోడే శ్రీనివాసరావు, అంకంరెడ్డి చిన్నయ్యనాయిడు,తదితరులు పాల్గొన్నారు.

నకిలీ, అక్రమ మద్యంపై సమాచారమివ్వండి

ప్రజాశక్తి-పాయకరావుపేట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుండి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని, లైసెన్స్ లేని అనధికార వ్యక్తుల వద్ద మద్యం కొనుగోలు చేయడం చాలా ప్రమాదకరమని పాయకరావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గిడ్డి శ్రీనివాసు తెలిపారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. అనధికార వ్యక్తుల వద్ద కొనుగోలు చేసిన మద్యం నకిలీది కావచ్చని తెలిపారు. వివాహాలు, పార్టీలు లేదా ఇతర సామూహిక వేడుకల సందర్భాలలో మద్యాన్ని తగ్గింపు ధరలకు సరఫరా చేస్తామని చెప్పే వ్యక్తులు ప్రజలను మోసం చేసే అవకాశముందన్నారు. వీరు సరఫరా చేసే నకిలీ మద్యం ప్రజల ఆరోగ్యానికి తీవ్రమైన హానిని కలిగిస్తుందని కొన్ని సందర్భాలలో మరణానికి కూడా దారి తీస్తుందని అన్నారు. అటువంటి అనుమానిత వ్యక్తుల వివరాలను వెంటనే తమకు తెలియజేయాలన్నారు. ఎవరైనా నకిలీ, అక్రమ మద్యం విక్రయించినట్లయితే టోల్ ఫ్రీ నంబరు : 14405 9440902383, 7702278287 కు సమాచారం తెలపాలని సిఐ శ్రీనివాసు తెలిపారు.

పాఠశాల భవనం మంజూరుకు ప్రతిపాదనలు

-జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు

ప్రజాశక్తి- నక్కపల్లి: మండలంలో పెదబోదుగల్లంలో శిధిలావస్థకు చేరుకున్న హైస్కూల్ భవనాలను జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావు నాయుడు బుధవారం పరిశీలించారు. పాఠశాల భవనం శిధిలంలో ఉండటం వల్ల గత కొంతకాలంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పాఠశాల హెచ్.ఎమ్.జయశ్రీ డిఇఓ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా డి.ఈ.వో మాట్లాడుతూ, తక్షణమే పాత భవనాలను తొలగించి నూతన భవనాలు మంజూరు అయ్యేలా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. శిధిలావస్థలో వున్న తరగతి గదుల వైపు విద్యార్థులు వెళ్లకుండా ఆ ప్రదేశాన్ని బ్లాక్ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. త్వరలోనే వాటిని తొలగించడానికి సంబంధిత అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ పెన్నాడ అప్పారావు, తెలుగు దేశం పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, గ్రామ సర్పంచ్ ఫాతిమున్నీషా బేగం, ఎం ఈ వో కే.నరేష్ విద్యాశాఖ సిబ్బంది వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న డిఇఓ

మాట్లాడుతున్న అప్పలరాజు

పోలవరం ఎడమ కాలువపై బ్రిడ్జి నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో పెదబోదుగళ్ళం, పెద్దదొడ్డగల్లు గ్రామాల మధ్య పోలవరం ఎడమ కాలువ పై వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మండల కార్యదర్శి రాజేష్ డిమాండ్ చేశారు. బుధవారం బురదమయంగా ఉన్న కాలువ గట్టును పరిశీలించారు. విద్యార్థులు, గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను అప్పలరాజు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలువ గట్టు వర్షం కురిసినప్పుడల్లా బురదమయంగా మారడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెద్దదొడ్డిగల్లు, సీతంపాలెం గ్రామానికి చెందిన విద్యార్థులు చదువుకునేందుకు పెద్దబోదుగల్లం పాఠశాలకు కాలువ గట్టు పైనుండే విద్యార్థులు రాకపోకలు సాగిస్తూ ఉంటారని, కాలువ గట్టు బురదమయంగా మారడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెదదొడ్డగల్లు, సీతమ్మపాలెం గ్రామాల ప్రజలు నక్కపల్లి రాకపోకలు సాగించేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి, శాశ్వత బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలతో కలిసి ఆందోళన చేపడతామన్నారు.

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి కృష్ణా క్లబ్ ఆవరణంలో శ్రీ వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఆలయ ధర్మకర్త అడ్డూరి చక్రనాగేశ్వరరావు(ప్రకాష్) నూకరత్నం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పురోహితులు పండు స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, హెూమం నిర్వహించారు.ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు మామిడి తాతాజీ, కాసులు, సాయిబాబా ఆలయ ధర్మకర్త కొల్నాటి ఆదినారాయణ, సామాజిక సేవా కార్యకర్త నవర నూకరాజు శర్మ, నాథముని కష్ణ, మీగడ సత్తిబాబు, పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న భక్తులు

హైడ్రో పవర్ ప్లాంట్‌ను నిర్మిస్తే తరిమి కొడతాం

-సిపిఎం, ఆదివాసీల ఆందోళన- జిఒ 51 పత్రాలు దగ్ధం

ప్రజాశక్తి-అనంతగిరి: అనంతగిరి మండలం పెదకోట ఎరియాలో హైడ్రో పవర్ ప్లాంట్లుకు నిర్మాణానికి ప్రభుత్వ ఇచ్చిన జీవో 51ను వెంటనే రద్దు చేయాలని, దీన్ని నిర్మాణం చేపడితే తరిమి కొడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, ఆనంతగిరి జెడ్పిటిసి దీసరి. గంగరాజు, అనకాపల్లి జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి.వెంకన్న, అనంతగిరి మండల నాయకుడు ఎస్ నాగులు కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం పెదకోట ప్రాంతంలో హైడ్రో పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టే ప్రాంతాన్ని స్థానిక గిరిజనులతో కలిసి పరిశీలించారు. జివో 51 కాపీని దగ్ధం చేసారు. జీవో వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు మాట్లాడుతూ, గ్రామసభ, 1/70 చట్టం, పీ.స.చట్టం అటవీ హక్కులు చట్టాన్ని, ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో వర్తించే వివిధ రాజ్యాంగ నిబంధనలను బహిరంగంగా ధిక్కరిస్తూ హైడ్రో పవర్ ప్లాంట్లకు అనుమతించిన తీరు తీవ్ర ఆందోళనకు గురి చేస్తోందని తెలిపారు. పీసా చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం ఏదైనా భూసేకరణకు ముందు ప్రభుత్వం వివరణాత్మక ప్రాజెక్ట్ సమాచారాన్ని మండల ప్రజా పరిషత్‌కి సమర్పించాలన్నారు. ఈ సమాచారంలో సమగ్ర ప్రాజెక్ట్ రూపు రేఖలు, సామాజిక ప్రభావాలు, భూసేకరణ ప్రత్యేకతలు, కొత్త స్థిర నివాసుల గురించి సమాచారం ఉంటుందన్నారు. ప్రభావిత వర్గాలకు ప్రతి పాదిత పరిహారం వంటివి ఉండాలని తెలిపారు. అప్పుడు ఎంపిపి చట్ట బద్ధంగా ప్రభావిత గ్రామ పంచాయతీ, గ్రామ సభలతో సంప్రదించి వారి అంచనాలు, సిఫార్సులను సేకరించాలన్నారు. ఈ సంప్రదింపుల తర్వాత, ఎం.పి.పి ఈ సిఫార్సులను ఏకీకృతం చేసి, భూసేకరణ అధికారికి తుది సిఫార్సును సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎఫ్.ఆర్.ఏ లోని సెక్షన్ 4(డి) కమ్యూనిటీ అటవీ వనరులను నియంత్రించడానికి, వన్యప్రాణులు-జీవ వైవిధ్య రక్షణకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడానికి గ్రామసభ అధికారాన్ని బలోపేతం చేస్తుందని తెలిపారు. కంపెనీలైన వాటాదారులు ఈ నిర్ణయాలకు కట్టుబడి ఉండాలని నిర్దేశిస్తుందన్నారు. ఈ సంప్రదింపుల ప్రక్రియను పూర్తిగా దాట వేశారని తెలిపారు. దీనిపై ఇప్పటివరకు ఎటువంటి చర్చ జరగలేదన్నారు. పార దర్శకత లేదని తెలిపారు. గిరిజన సలహా మండలి (టి.ఎ.సి)లో ఈ ప్రాజెక్టులపై చర్చలు, ముందస్తు సంప్రదింపులు జరపడానికి ప్రభుత్వం పట్టించు కోలేదన్నారు. ఇప్పటికీ టి.ఎ.సిని నియ మించలేదన్నారు. ప్రాజెక్టులతోఆదివాసీ తెగ జీవనోపాధిని కోల్పోయే అవకాశం ఉందన్నారు ఆయకట్టు భూములు పూర్తిగా బీడు బారి పోతాయని తెలిపారు. వెంటనే 51 ని రద్దు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో పెదకోట ఎంపిటిసి సిరగం శ్రావణి, సోముల చిన ఎర్రయ్య, సోముల దేముడు, నారాంగి సింహచలం ,గోల్లూరి అనంద్ , దేముడు గల్లూరి గోవిందు, గుంటా గోవిందు, జన్ని ఈశ్వరరావు, జన్ని వెంకటరావు, గిరిజన సంఘం నాయకులు నరాజీ సురేష్ బాబు,కె.భాస్కర్, గిరిజనులు పాలొన్నారు,

ఆందోళన చేస్తున్న గంగరాజు, వెంకన్న, గిరిజనులు

అల్లూరి జయంతి వేడుకలకు ఏర్పాట్లు

ముస్తాబైన అల్లూరి పార్కు ముఖద్వారం

సుందరంగా పార్కు

ప్రజాశక్తి-గొలుగొండ: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని ఈ నెల 4న గొలుగొండ మండలం కృష్ణదేవిపేట అల్లూరి పార్కులో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. ఈ మేరకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే పార్కులో సమాధుల మందిరం వద్ద ఆధునీకరణ, నాలుగు పగోడాలకు మరమ్మత్తులు, టైల్స్‌కు మరమ్మత్తులు, నూతన లైట్లు ఏర్పాటు చేశారు. పార్కు ముఖద్వారంతో పాటు మెట్లకు వద్ద రంగులు వేసి సర్వాంద సుందరంగా తీర్చిదిద్దారు. ఆరోజు రంగవల్లికలతో పాటు విద్యార్థులతో భారీ ర్యాలీ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అల్లూరి వేషధారణలతో నాటకం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ జయంతి వేడుకలకు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుతో పాటు మంత్రులు కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర, ఎంపీలు సీఎం రమేష్, కలిశెట్టి అప్పలనాయుడు, ఇతర అధికారులు హాజరు కానున్నారు. ఈ ఏర్పాట్లను తహశీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపిడిఒ మేరీరోజ్, మాజీ జెడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్ పర్యవేక్షించారు.

సమాధులను ముస్తాబు చేస్తున్న సిబ్బంది

టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి

నట్టల నివారణ మందుల పంపిణీ

ప్రజాశక్తి - చీడికాడ: గొర్రెలు, మేకలకు ఉచితముగా నట్టల నివారణ మందులు పంపిణీ చేయడం జరిగిందని చీడికాడ మండలం అర్జున గిరి గ్రామంలో పశు వైద్యాధికారి మణి లక్ష్మణ్ తెలిపారు. గ్రామ సర్పంచ్ బడాల రమాదేవి చేతుల మీదుగా బుధవారం నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో గొర్రెలు, మేకలు తొందరగా జబ్బులు బారిన పడతాయన్నారు. గొర్రెలు మేకలు, పెంపకం దారులు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పశుసంవర్ధక సహాయకులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అర్జునగిరి వైస్ సర్పంచ్ జి. అప్పల నాయుడు, ఎం.పిటిసి అమ్మతల్లి నాయుడు, మాజీ వైస్ ఎంపిపి కె.గణపతి పాల్గొన్నారు.